వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 16 మే 2023

## కొండాపురం రోడ్డు ప్రమాదాన్ని పరిశీలించిన ఎస్పీ



కడప క్రైం, మే 15, ప్రభాతవార్త:

కొండాపురం సమీపంలోని ఏటూరు గ్రామం చిత్రావతి వంతెన వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం జరిగిన ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పరిశీలించారు. ఈ ప్రమాదంలో మొత్తం 7 మంది మరణించారు. తిరుమల దర్శనానికి వెళ్లి తాడిపత్రికి తుఫాన్ వాహనంలో వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాద ఘటనపై జిల్లా ఎస్పీ అన్బురాజన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే ఘటనా స్థలానికి ఎస్పీ చేరుకొని అక్కడ ఘటన జరిగిన తీరును అందుకు గల కారణాలను నిశితంగా పరిశీలించారు. తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. జిల్లా ఎస్పీతో పాటు జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## కడపలో ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య



కడప, క్రైం, మే 15 ప్రభాతవార్త :

కడప నగరంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శివప్రసాద్ కడప రాజంపేట బైపాస్‌లోని ఒల్యాడ్జిలో ఆత్మహత్యకు పాల్పాడారు. విషయం తెలుసుకున్న రిమ్స్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. ఈ మేరకు పోలీసులు మాట్లాడుతూ శివ ప్రసాద్ గతంలో వన్‌టౌన్ సి.ఐ. సత్యనారాయణ వద్ద గన్‌మెన్‌గా పనిచేశారని ఈ సంఘటనకు కారణాలు తెలుసుకుంటామన్నారు. శివప్రసాద్ మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

# ఘోర రోడ్డు ప్రమాదం - ఏడుగురి దుర్మరణం

### - చెల్లాచెదురైన మృతదేహాలు - 8మందికి తీవ్రగాయాలు

### - నెత్తురోడిన రహదారి



ప్రమాదంలో దెబ్బతిన్న తుఫాను వాహనం, సంఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడిన మృతదేహం

కొండాపురం, మే 15, ప్రభాతవార్త ః

కొండాపురం మండలంలోని పి.అనంతపురం సమీపంలోని చిత్రావతినది దగ్గర కడప-తాడిపత్రి జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.. తాడిపత్రికి చెందిన తుఫాను వాహనంలో రెండు రోజుల క్రిందట తిరుమల దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా సోమవారం తెల్లవారుజామున ఎదురుగా వస్తున్న లారీ ఈ వాహనాన్ని ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణం, కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన బంధువులు కలిసి తిరుమలకు వెళ్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని తిరిగి బయలుదేరారు. మరో 20 నిమిషాల్లో సంతోషంగా ఇళ్లకు చేరుకుంటామనుకున్నారు. ఇంతలోనే ఎదురుగా వచ్చిన లారీ రూపంలో మృత్యువు వీరిని కబళించింది. ఈ ప్రమాదంలో తుఫాను డ్రైవరు సుధాకర్‌రెడ్డి (31), బళ్లారికి చెందిన తాటసాని సుధ (39), నిఖిత్‌కుమార్‌రెడ్డి(11), తాడిపత్రి పట్టణానికి చెందిన ఎన్.లక్ష్మీదేవి(39), సునీల్ కుమార్‌రెడ్డి(37), బుజ్జి(40), కె.సుభద్ర(35)లు అక్కడికక్కడే



మృతిచెందారు. సంఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడిన మృతదేహాలను చూసి పలువురు కంటతడిపెట్టారు. మరో 8మంది గాయపడడంతో చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం సవేరా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు సురక్షితంగా బయట పడ్డారు. అనంతరం కొండాపురం సీఐ సురేంద్రప్రసాద్, ఎస్సై సత్యనారాయణలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టి క్షతగాత్రులను 108 వాహనంలో తరలించారు. అలాగే ఘటనా స్థలాన్ని జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్పీ నాగరాజులు పరిశీలించారు. ఈ మేరకు కొండాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన బంధువులు సంఘటనా స్థలం వద్ద భోరున విలపించారు.

## ప్రజల సమస్యలకు మొదటి ప్రాధాన్యత

### - జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

రాయచోటి, మే 15ప్రభాతవార్త:

ప్రజల సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ గంగాధర్ రావు పోలీసు అధికారులను ఆదేశించారు. అన్నమయ్య జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర్‌రావు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి 57 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలకు సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్కరి కేసు విషయాలను కులంకుశంగా అడిగి తెలుసుకొని సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపి స్పందన ఫిర్యాదలను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా స్పందన ఫిర్యాదులు పట్ల అలసత్వం వహించ కూడదని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుటుంబం కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు, ఆస్తి తగాదాలు, ఇతరత్రా కారణాలతో ఫిర్యాదులు అందాయి.



జిల్లా ఎస్పీ కార్యాలయానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన 57 మంది వారి సమస్యలను స్పందన ద్వారా విన్నవించుకున్నారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదు దారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తెలిపారు.

## యువనేతకు సంఘీభావంగా తరలివచ్చిన పసుపుదండు

రాయచోటి, మే 15 ప్రభాతవార్త :

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు పాదయాత్రకు సంఘీభావంగా సోమవారం రాయచోటి పట్టణానికి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లి, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, మండలాల నుంచి నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ జెండాలతో లోకేష్ బాబు జెండాలతో బైకుల ర్యాలీతో యువకులు పలు ప్రాంతాల నుంచి రాయచోటి అన్నమయ్య సర్కిల్ చేరుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో తెలుగుదేశం నాయకులతో రాయచోటి పట్టణం ప్రధాన రహదారులు తెలుగుదేశం జెండాలతో పసుపు మయమయ్యాయి. నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రాయచోటి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు ప్రసాద్ బాబుల ఆధ్వర్యంలో ప్రారంభమైన పాదయాత్రకు ప్రజల నుంచి అన్యూహస్పందన లభించింది అన్నమయ్య సర్కిల్ నుంచి వేలాది సంఖ్యలో తరలివచ్చారు. పలు కూడళ్ళలో ఉన్న విగ్రహాల కు పూలమాలలు వేసి నివాళులర్పించారు . పాదయాత్రలో దారి పొడవునా బాణసంచాలు పేలుస్తూ గజమాలలు వేస్తూ పూలవర్షముతో నడిపించిన కార్యకర్తలు



నాయకులు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు యువ గళం పాదయాత్రతో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వానికి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని రాయచోటి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి ఆరోపించారు. సోమవారం యువగళం పాదయాత్రకు సంఘీభావంగా నిర్వహించిన పాదయాత్రలో రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నారా లోకేష్ బాబు పాదయాత్ర లో వైసీపీ ప్రభుత్వ అరాచకాలు బయటపెడుతూ ప్రజల కష్టాలు తెలుసుకుంటూ ప్రజలతో మమేకమవుతూ సాగుతున్న పాదయాత్రలో ప్రజలు స్వచ్ఛందంగా వేలాదిమంది తరలివస్తుండడంతో వైసీపీ నాయకులకు నిద్ర పట్టడం లేదన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల ప్రజలకు వైసీపీ ప్రభుత్వం చేసింది శూన్యన్నారు. వైసీపీ నాయకులు అక్రమాలతో అరాచకాలతో ప్రభుత్వ ఆస్తులు కొల్లగొడుతున్నారని, ఇసుక మట్టి మైనింగ్ దందాలు నిర్వహించి ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొడుతున్నారని రమేష్ కుమార్ రెడ్డి ఆరోపించారు.

## 2 చోరీ కేసుల్లో 10.50 లక్షలు విలువ చేసే బంగారు నగలు స్వాధీనం

### ప్రజలు సహకరిస్తే దొంగతనాలకు చెక్ - డిఎస్‌పి విఎన్‌కె చైతన్య

రాజంపేట అర్బన్, మే 15 ప్రభాతవార్త

ప్రజలు పోలీసులకు సహకారం అందిస్తే దొంగతనాలు జరగకుండా అరికట్టవచ్చునని రాజంపేట నూతన డిఎస్‌పి విఎన్‌కె చైతన్య పేర్కొన్నారు. అవకాశం ఉన్నవారు తమ ఇళ్లల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం, వేసవి సెలవుల్లో ఊర్లకు వెళ్లేటప్పుడు ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో సమాచారం ఇచ్చినట్లు అయితే దొంగతనాలకు చెక్ పెట్టవచ్చునని పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజంపేట అర్బన్, ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్ల పరిధిలో ఇటీవల జరిగిన 2 చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారివద్ద నుంచి 10.50 లక్షలు విలువ చేసే 296 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకొన్నట్లు వెల్లడించారు. రాజంపేట అర్బన్ స్టేషన్‌లో గత నెలలో నలందా హైస్కూల్ సమీపంలోని మెహర్‌బాబానగర్‌లో బొజ్జిరెడ్డి అశోక్‌రెడ్డి ఇంటిలో పాత నేరస్తుడు ఎస్‌వినగర్‌కు చెందిన బాలిపోగు ఇజ్రాయిల్ 88 గ్రాముల బంగారు నగలును చోరీ చేశానన్నారు. గతంలో కూడా నిందితుడిపై కేసు నమోదు అయి శిక్ష కూడ పడిందన్నారు. అలాగే ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్ పరిధిలో ఓ చైన్ స్నాచింగ్ కేసుకు సంబంధించి నిందితుడు పుల్లంపేట మండలం కొండంపల్లె అరుంధతివాడకు చెందిన పల్లెపాద



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి విఎన్‌కె చైతన్య,

వెంకటసుబ్బయ్యను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ నిందితుడి నుంచి 5 కేసులకు సంబంధించి 208 గ్రాముల బంగారు నగలును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని డిఎస్‌పి పేర్కొన్నారు. ఈ రెండు కేసులను జిల్లా ఎస్‌పి రెడ్డిగంగాధర్‌రావు ఆదేశాల మేరకు టీమ్‌లను ఏర్పాటు చేసి నిందితులను పట్టుకొన్నామన్నారు. రాజంపేట అర్బన్ సిఐ నరసింహారావు, రైల్వేకోడూరు సిఐ విశ్వనాథ్‌రెడ్డి, రాజంపేట ఎస్‌ఐలు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లె ఎస్‌ఐ బి.శ్రీకాంత్‌రెడ్డి, ఎఎస్‌ఐ వర్మ, కానిస్టేబుళ్ల రామక్రిష్ణారెడ్డి, ప్రభాకర్, నరసింహా, ఓబులవారిపల్లె పోలీసులు ఉపేంద్ర, మణిరత్నం, మల్లికార్జునలు నిందితులను పట్టుకొన్నారన్నారు.

## హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగారశిక్ష

### - రూ.5లక్షలు జరిమానా విధించిన 2వ అదనపు జిల్లా కోర్టు



ప్రొద్దుటూరు క్రైం, మే 15, ప్రభాతవార్త:

రెండేళ్ల క్రితం రాజుపాళెం మండల పరిధిలో రోకలి బండతో తలపై మోది హత్య చేసిన కేసులో నేర నిర్ధారణ కావడంతో ముద్దాయి చిట్టిబోయిన రామాంజనేయులు(21)కి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.5లక్షలు జరిమానా విధిస్తూ సోమవారం ప్రొద్దుటూరులోని 2వ అదనపు జిల్లా కోర్టు జడ్జి జి.ఎస్.రమేష్‌కుమార్ తీర్పు ఇచ్చారు. రూ.5లక్షలు జరిమానా చెల్లించకపోతే అదనంగా మరో అయిదేళ్లు శిక్ష అనుభవించాలని జడ్జీ తీర్పులో పేర్కొన్నారు. కేసు వివరాలు ఈనెల 9వ తేదీన రాజుపాళెం మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో క్రికెట్ ఆడుతుండగా ముద్దాయి రామాంజనేయులు ఆటలో మనస్పర్థలతో చరణ్ అనే యువకుడిని కొట్టాడు. చరణ్ ఈ విషయాన్ని ఇంటికి వెళ్లి హతుడు, తన చిన్నాన్న అయిన చీలి దస్తగిరి(41)కి చెప్పగా ముద్దాయి రామాంజనేయులను అడిగేందుకు వెళ్లగా ముద్దాయి రోకలి బండతో తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై దస్తగిరి మృతి చెందాడు. చరణ్ తండ్రి చీలి సుధాకర్ పిర్యాదు మేరకు అప్పటి రాజుపాళెం ఎస్సై కృష్ణంరాజు నాయక్ కేసు నమోదు చేయగా అప్పటి రూరల్ సీఐ మధుసూదన్‌గౌడ్ కేసును దర్యాప్తు చేపట్టారు. సాక్షాధారాలతో ముద్దాయికి శిక్ష పడేలా కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాంప్రసాద్‌రెడ్డి వాదించారు. ముద్దాయికి శిక్ష పడేలా కృషి చేసిన ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణకుమార్ అప్పటి ప్రొద్దుటూరు రూరల్ సీఐ మధుసూదన్‌గౌడ్, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు, కోర్టు కానిస్టేబుళ్లు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

## 33 లక్షలు విలువ చేసే విలువ 165 సెల్ పోన్లు స్వాధీనం

### బాధితులకు అప్పగింత - జిల్లా ఎస్పీ గంగాధర్ రావు

రాయచోటి, మే 15 ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లా పోలీస్ లు మూడవ విడతలో 33 లక్షలు విలువ చేసే 165 సెల్ ఫోన్లు రికవరీ చేసి సోమవారం జిల్లా ఎస్పీ గంగాధర్ రావు బాధితులకు అందజేశారు. మొబైల్స్ ట్రేస్ చేసిన సైబర్ క్రైం, టెక్నికల్ ఎనాలిసిస్ వింగ్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఇప్పటివరకు మొత్తం 404 మొబైల్ ఫోన్‌లను పోగొట్టుకున్న ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి రికవరీ చేసి భాధితులకు అందజేసినట్లు ఎస్పీ చెప్పారు. మొదటి విడతలో 109 మొబైల్ ఫోన్లు (23 లక్షలు), రెండవ విడతలో 130 మొబైల్ ఫోన్లు (26 లక్షలు), మూడవ విడతలో 165 మొబైల్ ఫోన్లు (33 లక్షలు). రికవరీ చేసినట్లు ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా బాధితుల ఫోన్లను రికవరీ చేసి ఇవ్వడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా పోలీసులు అతి తక్కువ సమయంలోనే మూడవ విడతలో భాగంగా వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుండి రికవరీ చేసిన 165 మొబైల్ ఫోన్లను ఎస్పీ బాధితులకు అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్



లో "మొబైల్ రికవరీ మేళా" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మీడి యాతో మాట్లాడారు. ఈ రోజు 165 మొబైల్ ఫోన్లను రిక వరీ చేసి బాధితులకు అందజేయడం సంతోషంగా ఉంద న్నారు. ప్రజలకు మంచి సేవలందించేందుకు సైబర్ క్రైం, టెక్నికల్ ఎనాలిసిస్ వింగ్ సిబ్బంది, పోలీసులు మొబైల్ ట్రాకింగ్ పై బాగా పని చేస్తున్నారన్నారు. పోయిన మొబైల్ ఫోన్లను రికవరీ చేసేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నారన్నారు.

# ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తున్న ప్రభుత్వ వ్యతిరేకత

### - మా ఓటు మమ్మల్ని వేసుకోనివ్వాలంటున్న పులివెందుల ప్రజలు - బానిసత్వ బతుకు నుండి విముక్తివైపు పులివెందుల ప్రజల దృష్టి

### - పులివెందులలో ఫ్లెక్సీలు ధ్వంసం చేసి రెచ్చగొడుతున్న వైనం - కవ్వింపు చర్యలు చేయకుండా పోలీసులే చూసుకోవాలి

### - అరాచక పాలనకు చరమగీతం పాడే రోజులు వచ్చాయి - వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, ఎంపీ స్థానాలు తెదేపా వశం

### - సంఘీభావ పాదయాత్రలో శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి

పులివెందుల, మే 15, ప్రభాతవార్త ః

తెదేపా యువనేత లోకేష్‌బాబు నిరుద్యోగ యువత కోసం, అవినీతి అరాచక ప్రభుత్వం, హత్యా రాజకీయ పాలన నుండి విముక్తి కోసం ప్రజల్లో చైతన్యం కల్పించడానికి రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న యువగళం పాదయాత్ర 100వ రోజుకు చేరుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో సంఘీభావ యాత్రలు జరుగుతున్న నేపథ్యంలో పులివెందులలోని మున్సిపాలిటీ పరిధిలోని ఉలిమెళ్ల సమీపం నుండి సోమవారం లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా జిల్లా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివా సరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డిల ఆధ్వర్యంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు సంఘీభావయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రకు మద్దతుగా పెద్దఎత్తున తెలుగుతమ్ముళ్లు హాజరై చంద్రబాబు జై.. లోకేష్‌బాబు జై.. అంటూ అరాచక ప్రభుత్వం తొలగిపోవాలి అంటూ నినాదాలు చేస్తూ పసుపుజెండాలు చేతపట్టి చిందులు వేస్తూ పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం వరకు జనసందోహం మధ్య పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రకు తెదేపా కార్యకర్తల నుండి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ పులివెందులలో, రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మా ఓటు మమ్మల్ని వేసుకోనివ్వండి అని పులివెందుల ప్రజలు కోరుకుంటున్నారు. 1978 నుండి ఒకే కుటుంబానికి ప్రజలు పట్టం కడుతున్నారని, అయితే ఈ బానిసత్వం నుండి విముక్తి అయ్యేందుకు ప్రజలు మాకు ఓటు వేసుకునే అవకాశం



ఇవ్వండి అంటూ కోరుకుంటున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అవినీతితో కొట్టుమిట్టాడుతోందని, రాత్రిపూట సొంత కుటుంబ సభ్యులనే చంపుకునే స్థితికి దిగజారిపోయిందన్నారు. అరాచక ప్రభుత్వం రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతోందని, అందుకు నిదర్శనమే గత రాత్రి తెలుగు తమ్ముళ్లు ఫ్లెక్సీలు కట్టుకోవడానికి వస్తే కొంతమంది వైకాపా వర్గీయులు అడ్డుకుని ధ్వంసం చేసి రెచ్చగొడుతున్నారన్నారు. ఈ విషయం పోలీసుల దృష్టికి కూడా తీసుకువెళ్లామన్నారు. మీరు ఏమి చేసినా అణిగి ఉండమని, ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడకుండా పోలీసులే చూసుకోవాలని, లేకుంటే ఎటువంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధమే అన్నారు. పులివెందుల ప్రజలు తెదేపావైపు మొగ్గు చూపుతున్నారని, మాకు కూడా ఒక అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తామని ఆయన అన్నారు. అనంతరం జిల్లా పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో ఐతులకు చేసిందేమీ లేదని, ఏ రైతు కూడా ఆనందంగా లేరన్నారు. వైసీపీ కేడర్ కేవలం అవినీతిలోను, వారు ఆస్తులు సంపాదించుకోవడంలోనే మునిగి ఉన్నారని, ప్రజల సంక్షేమాన్ని మరిచారన్నారు.

ఒకరిని ఒకరు చంపుకుంటూ కేసుల వెంట ఆ కుటుంబ సభ్యులు తిరుగుతున్నారన్నారు. 40ఏళ్ల నుండి ఒకే కుటుంబానికి పట్టం కడుతున్నామని, ఒక్కసారి తెదేపా కు వచ్చే ఎన్నికల్లో అవకాశం ఇచ్చేందుకు ప్రజలు మొగ్గు చూపుతు న్నాన్నారు. కడప ఎంపీ, పులివెందుల ఎమ్మెల్యే స్థానాలలో కూడా తెదేపా జెండా ఎగరడం ఖాయమని అన్నారు. ఈ పాదయాత్రలో తెదేపా నాయకులు మారెడ్డి భరత్‌కుమార్‌రెడ్డి, బ్రాహ్మణపల్లె వెంకటరామిరెడ్డి, తొండూరు శివమోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహబూబ్ బాషా, ప్రసాద్‌రెడ్డి, అక్కులుగారి విజయ్‌కుమార్‌రెడ్డి, బొజ్జ మైసూరారెడ్డి, తూగుట్ల రాఘవరెడ్డి, తూగుట్ల మధుసూధన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివాహంకు కులం అడ్డురావడంతో....

### -ఇద్దరు ప్రేమికులు బలవన్మరణం - గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహాలు

### -సంఘటనా స్థలంలోనే శవపంచనామా

### -మృతదేహాలను స్వగ్రామానికి తీసుకెళ్లిన కుటుంబసభ్యులు

మదనపల్లెక్రైం, మే 15 ప్రభాతవార్త :

మూడు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్న ఓ జంట పెళ్లిచేసుకుని సంతోషంగా వుండటానికి కులం అడ్డువచ్చింది. ఓ వైపు కేసులు, మరో వైపు పెద్దల ఒత్తిడి. పెద్దలను ఎదిరించే ధైర్యం లేక, ఒకరిని విడిచి మరోకరు జీవించలేక ఆ ప్రేమజంట మదనపల్లె రూరల్ మండలం అబ్బగొంది అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. అనంతపురం జిల్లాకు చెందిన ఈ జంట 5 రోజుల క్రితం కొండపై ఉరివేసుకుని మృతచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి రావటంతో పోలీసులు సోమవారం పరిశీలించారు. మృతి చెంది 5 రోజులు కావటంతో మృతదేహాలు ఉబ్బిపోయి గుర్తిపట్టలేని స్థితిలో వున్నాయి. సిఐ కథనం మేరకు వివరాలిలా వున్నాయి. అనంతపురం జిల్లా కూడేరు మండలం ఉదిరిపికొండకు చెందిన ముత్తులూరి ధనుంజయ కుమారుడు వెంకటనాయుడు (28) వైజాగ్‌లో ఓ ఫార్మసీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదే ఊరికి చెందిన రమణ, వరలక్ష్మి దంపతుల కుమార్తె వి.వినీషా (17) కర్నూల్‌లో ఇంటర్ పూర్తి చేసింది. వీరిద్దరూ మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రేమవిషయం తెలిసి ఇరుకుటుంబసభ్యులు పలుమార్లు ఘర్షణపడ్డారు. రెండు సంవత్సరాలు క్రితం వీరిద్దరు ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. వినీషా తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కూడేరు పోలీసులు వెతికి తీసుకొచ్చారు. ఆ సమయంలో వినీషా మైనర్ కావటంతో వెంకటనాయుడుపై ఫోక్సో కేసు నమోదు చేశారు. ఇదిఇలావుండగా ఇటీవల ఉదిరిపికొండలో జరిగిన గంగజాతరలో కలుసుకున్న వెంకటనాయుడు, వినీషాలు పెద్దలకు దూరంగా వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఈనెల 9వ తేది ద్విచక్రవాహనంలో స్వగ్రామం నుంచి తిరుమలకు చేరుకొని దైవ



ఆత్మహత్యకు పాల్పడిన ప్రేమికులు, సంఘటనా స్థలంలో కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న సిఐ

దర్శనం చేసుకున్నారు. వినీషా మెడలో పసుపుతాడు వుండటంతో వీరు తిరుమలలో వివాహం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికి వినీషా మైనర్ కావటంతో కుటుంబసభ్యులు, పోలీసులు తమను కలిసి వుండనీయరేమోనన్న అనుమానం కలిగి, ఇద్దరు కలిసి చనిపోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో ద్విచక్రవాహనంలో తిరుమల నుంచి మదనపల్లె రూరల్ మండలం కొత్తవారిపల్లి పంచాయితీ అబ్బగొంది కొండ పైకి చేరుకున్నారు.

సంఘటన జరిగిన ప్రదేశం ఆటవీ ప్రాంతం కావటంతో సోమవారం ఉదయం సిఐ సత్యనారాయణ, ఎస్ ఐ, సిబ్బంది సంఘటనా స్థలంకు చేరుకుని పరిశీలించారు. ద్విచక్రవాహనం రిజిస్ట్రేషన్ నెంబర్ ద్వారా మృతుల వివరాలు సేకరించిన సిఐ, వారి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాలు బాగా కుళ్లిపోయి వుండటంతో జిల్లా ఆస్పత్రి వైద్యులను సంఘటనా స్థలంకే తీసుకెళ్లి శవపంచనామా చేయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. సమాచారం అందుకున్న ప్రేమికులు కుటుంబసభ్యులు మదనపల్లెకు చేరుకుని భోరున విలపించారు. శవపంచనామ అనంతరం రెండు మృతదేహాలను వారి వారి కుటుంబసభ్యులు స్వగ్రామంకు తీసుకెళ్లిపోయారు.

## అప్పుల బాధతాళలేక యువరైతు ఆత్మహత్య

పెద్దమండ్యం మే 15 ప్రభాతవార్త



అప్పుల బాధతాళలేక ఆదివారం రాత్రి యువరైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పెద్ద మండ్యం మండలం సిగోల్లపల్లె పంచాయితి కుడుమువారిపల్లెకు కుళ్ళాయిరెడ్డి (40) ఆదివారం రాత్రి పురుగుల మందు త్రాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బంధువులు హుటాహుటిన పెద్దమద్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. విషయం క్రిటికల్‌గా ఉండడంతో రాయచోటికి తరలించారు. అక్కడివైద్యులు మెరుగైన చికిత్సకోసం కడపరిమ్స్‌కు తరలించారు. అక్కడచికిత్స పొందుతూ మరణించినట్లు వారిబంధువులు తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా టమోటాపంటల్లో ధరలులేక చాలా నష్ట పోయారని చేసిన అప్పులు తీర్చలేక దిక్కుతోచనిస్థితిలో పురుగుల మందు తాగినట్లు తెలిపారు. మృతునికి భార్యా ముగ్గురు పిల్లలు ఉన్నారు. విషాదఛాయలు అలముకున్నాయి.

## అమూల్ పాల ఉత్పత్తిపై అవగాహన సదస్సు

పెద్దమండ్యం మే 15 ప్రభాతవార్త



అమూల్‌పాల ఉత్పత్తి, సేకరణ అంశాలపై సోమవారం అమూల్ జిల్లా కో- ఆర్డినేటర్ నవీన్, లక్ష్మికాంత్ నిర్వాహకులకు, కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. పాలధర వెన్నశాతంపై ఆధారపడి ఉంటుందని అన్నారు. అ ందుకు యంత్రాలద్వారా వెన్న శాతాన్ని లెక్కించి ధరను నిర్ణ ఇస్తారని అన్నారు. ఇప్పటికి మండలంలో 45సెంటర్లను ఏర్పాటు చేశామని అన్నారు. పాపేపల్లె, పెద్దమండ్యం, బండ్రేవులలో త్వరలోనే 13సెంటర్లు ఏర్పాటు చేయాల్సి ఉందని అన్నారు. పాలసేకరణలో కార్యదర్శులు అవగాహన కల్పించాల్సి ఉందని అన్నారు. గ్రామా ల్లో రైతులకు పాల ఉత్పత్తి పెరగడానికి తీసుకోవాల్సి జాగ్రత్తలు ఎండుగడ్డి, దాణా, పచ్చిగడ్డి ఎంత మోతాదులో తీసుకుంటే వెన్నశాతం పెరుగుతుంది అన్నదానిపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడివో శ్రీధర్, ఎం పిపి పూర్ణచంద్రికా రమేష్, జడ్పీ టీసి పీరమ్మ, వెటర్నరీ డాక్టర్‌ఉస్మాన్, విక్రంరెడ్డి, ఎపివోమురళి, ఎపిఎం హరి పాల్గొన్నారు.

## లోకేష్ యువగళం సంఘీభావానికి తరలిన తెలుగు తమ్ముళ్ళు

గుర్రంకొండ, మే 15, ప్రభాతవార్త

తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తి చేసుకొన్న సంధర్భంగా సోమవారం సంఘీభావంగా తెలుగు తమ్ముళ్ళు గుర్రంకొండ నుండీ పీలేరుకు బయలుదేరారు. ఈ సంధర్భంగా మండల టిడిపి అధ్యక్షులు నాయిని జగదీష్‌కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ యస్. మురళీకృష్ణ, యూనిట్ ఇన్‌ఛార్జ్ బరినేపల్లి అనిల్‌కుమార్‌లు మాట్లాడుతూ యువగళం పాదయాత్రతో నియోజకవర్గంలో, దారిపొడవునా సమ స్యలు తెలుసుకొంటూ ముందుకు సాగుతున్నారన్నారు. 2024లో జరిగే ఎన్నికల లో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. సంఘీభావం తెలిపినవారు చెర్లోపల్లె యువనాయకులు చలమారెడ్డి, బయ్యారెడ్డి, యస్. రెడ్డెప్పరెడ్డి, యస్. వెంకటరమన, శ్రీరాములు వున్నారు.

## ఆధారాలతో సమస్యలను విన్నవించండి

### స్పందనాలో ఆర్డీఓ ఎంఎస్ మురళి

మదనపల్లె, మే 15 ప్రభాతవార్త :



ఆధారాలతో కూడిన అర్జీలను విన్నవించాలని ఆర్డీఓ ఎంఎస్‌మురళి తెలిపారు. సోమవారం సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన స్పందనా కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలను ఆర్డీఓకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజలు ఏదైనా సమస్యను విన్నవించేటప్పుడు తగిన ఆధారాలు అర్జీలకు జత చేయాలన్నారు. స్పందనాలో ఇచ్చిన సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా భూ సమస్యల పట్ల తగిన విచారణ జరిపి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి అర్హులైన వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన పలువురు భూ సమస్యలపై ఎక్కువగా అర్జీలు ఇచ్చారు.

## వాయువులో నవీన ఖనిజం

- కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగిన ముగ్గురాయి వ్యాపారం
- బదిలీ అయిన అధికారితో లోపాయికారి ఒప్పందాలు
- అధికంగా లక్షలు విలువ చేసే వేల టన్నులు కెమికల్ గ్రేడ్ ఖనిజం సరఫరా
- సర్వత్రా విమర్శలు గుప్పిస్తున్న వైనం

ఓబులవారిపల్లె, మే 15, ప్రభాతవార్త:



రవి అస్తమించని సామ్రాజ్యంలా గాలి, వానకు ఉరుము, మెరుపు తోడైతే ఎలా వర్షం బీభత్సంగా కురుస్తుందో వాయువులో నవీన ఖనిజం కలయికతో వారి వ్యాపారం 3 పువ్వులు, 6 కాయలుగా విరాజిల్లుతోంది. మంగంపేటలో ఓ ఎక్స్‌పోర్ట్ కంపెనీ పల్వరైజింగ్ మిల్లుల యజమాని కలిసి ఏపీఎండీసీలో బదిలీ అయిన ఓ అధికారితో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకొని అధికంగా వేల టన్నులు కెమికల్ గ్రేడ్ సరఫరా చేసేందుకు సహకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నేపథ్యంలో అక్రమాలకు పురుడు పోసుకున్న కొంత మంది సంస్థలో పనిచేసే నలుగురు పుత్రులు ఈ కంపెనీలకు పాలల్లో నీళ్ల వలే కలిసి వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారనే చెప్పవచ్చు. అయితే ఈ వ్యాపారాలు మూడో కంటికి తెలియకుండా చేసినట్లు ప్రచారం ఉంది. అంతేకాకుండా ఇంటి దొంగలే ధనాపేక్షతో ఖనిజం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారనే విమర్శలు లేకపోలేదు. ఏది ఏమైనా విచారణలో నిగ్గు తేల్చే విషయాలు బయట పడ్డప్పటికీ వాటిని రాజకీయ పరంగా అణచివేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఒక్క ప్రధ కొన్ని ఎక్స్‌పోర్టు కంపెనీలతో ఆ ఒక్క పుత్రుడు వ్యాపార లావాదేవీలు కొనసా గిస్తూ కెమికల్‌గ్రేడ్‌లో నాసిరకం సి మరియు డి గ్రేడులు కలిపి వ్యాపారాలు సాగించి కోట్లాది రూపాయలు లాభాపేక్షను పొందారనే విమర్శలున్నాయి. ఆ పుత్రుడు కోడూరు నియోజకవర్గంలోనే కాకుండా ఇతర పల్లెల్లో కూడా ఆదా యానికి మించిన ఆస్తులు కూడబెట్టి ఆ నల్ల ధనాన్ని తెల్ల ధనంగా మార్చు కోవడంలో వెన్నతో పెట్టిన విద్య అని తెలుస్తోంది. కోడూరులో కొన్ని చోట్ల కోట్ల విలువ చేసే భూములు, ప్లాట్లు కొన్నట్లు ప్రచారం సాగుతోంది. ఏది ఏమైనా మంగంపేటలో దాదాపు 175 మిల్లులు ఉండగా అందులో 65 మిల్లులకు పైగా మూత పడగా ఆ 7 మిల్లులు మోతగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా సంస్థలో పనిచేసే ఉద్యోగులే వ్యాపార లావాదేవీలు సాగిస్తూ అధిక లాభార్జనకు ఆశపడి అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు మెండుగా ఉన్నాయి. సమాచారంలో నిగ్గు తేల్చే నిజాలు బయట పడ్డా పోలీసు స్టేషన్‌లో ఐదు మందిని విచారించినా తూతూ మంత్రంగా పోలీసులతో విచారణ జరిపి చేతులు దులుపుకున్నారనే విమర్శలు లేకపోలేదు.

## ఉద్యోగులందరూ పాల్గొని ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయండి

### – జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి

రాయచోటి టౌన్, మే 15ప్రభాతవార్త:

అన్నమయ్య జిల్లాలో ఈనెల 22వ తేదీ నుంచి చేపట్టిన రిలే నిరాహార దీక్షలు విజయవంతం చేయాలని అన్నమయ్య జిల్లా ఎపి జిఈఎ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి కోరారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈనెల 25వ తేదీన రాయచోటి, 26న రాజంపేట, 27న మదనపల్లె, 29న లక్కిరెడ్డిపల్లె, 30న వాయల్పాడు, జూన్ 1న పీలేరు, జూన్ 2న తంబళ్లపల్లె, జూన్ 5న కోడూరు కేంద్రాలలో ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేపట్టే విధంగా తీర్మానం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి ఎం. సుధాకర్‌రాజు, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.రెడ్డినాయక్, వెంకటేశ్వర్లు, రాయచోటి తాలుకా కార్యదర్శులు సాయికుమార్, సుజిత్ పి. రాజా తది తరులు పాల్గొన్నారు.

## సుస్థిర పంట ఉత్పత్తి లాభసాటి వ్యవసాయం

కడప మే 15, ప్రభాతవార్త



నగర శివారులోని కెఎస్‌ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల లో కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగం వారి సంయుక్త ఆధ్వర్యంలో సుస్థిర పంట ఉత్పత్తి కోసం ఖచ్చితమైన లాభసాటి వ్యవసాయం రిమోట్ సెన్సింగ్, డ్రోన్ టెక్నాలజీ అనే అంశంపై కార్యశాలను నేడు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ సిరిల్ ప్రసన్న కుమార్ డైరెక్టర్ ఆఫ్ సిసిసిఐఆర్, సిఐటి (బెంగళూర్) వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నేడు ప్రపంచంలో రైతులు వ్యవసాయ రంగంలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఎలా అధిగ మించాలి, ఖచ్చితమైన లాభసాటి వ్యవసాయం, పంట నాణ్యత మెరుగు పరచ డానికి, ఉపగ్రహ చిత్రాలు, ఫీల్డ్ మ్యాపింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞా నాన్ని వల్ల ప్రయోజనాలు, సాంప్రదాయ వనరుల వినియోగాన్ని ఆప్టిమైజ్ చేసుకోవడం వలన వ్యవసాయ నిర్వహణ వ్యవస్థపై స్థిరమైన అభివృద్ధికి దోహదపడుతుందని, అనేక పర్యావరణ సమస్యలను పరిష్కరించడానికి వీలవు తుందని పేర్కొన్నారు. వారం రోజులు పాటు జరిగే ఈ కార్యాశాలకు ప్రముఖ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డ్ కేంద్ర ప్రభుత్వ సంస్థ న్యూఢిల్లీ వారు స్పాన్సర్ చేయగా, స్పాన్సర్ సంస్థ వారిని, కళాశాల ప్రోగ్రాం కార్యనిర్వాహకుల సిబ్బందిని కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ శ్రీ పి ప్రేమ్ కుమార్, ఈసీఈ విభాగాధిపతులు డాక్టర్ జి హేమలత, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ యం.వెంకట నారాయణ, సమన్వయకర్త డాక్టర్ అరుణ్ కుమార్, అధ్యాపక సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ పరీక్షను పరిశీలించిన జనార్ధన

కడప మే 15, ప్రభాతవార్త



ఇంజినీరింగ్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ను కేఓఆర్ఎమ్ లో పరిశీలించిన ఉప కులపతి ప్రో రంగ జనార్ధన్ కడప నగరంలోని కందుల ఓబుల్ రెడ్డి మెమోరియల్ ఇంజనీ రింగ్ కళాశాలలో జరుగుతున్న ఇంజనీరింగ్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ పరీక్షను జవహర్లాల్ నెహ్రూ టెక్నోలాజికల్ యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ రంగ జనార్ధన పరిశీలించారు. ఉప కులపతి తో పాటు డా మురళి,డా గిరిధర్,మధు, రెడ్డి మురళి పాల్గొన్నారు. ఉప కులపతి కొన్ని సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు ఇచ్చిన కంప్యూటర్ సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు

## రాష్ట్రంలో సైకో పాలన పోవడం తథ్యం

### పార్లమెంటరీ టిడిపి అభ్యర్థి గంటానరహరి

మదనపల్లె, మే 15 ప్రభాతవార్త :



రాష్ట్రంలో సైకో ప్రభుత్వ పాలన పోవడం ఖాయమని రాజంపేట పార్లమెంటు టిడిపి ఎంపి అభ్యర్థి గంటానరహరి తెలిపారు. నారాలోకేష్ యువగళం పాదయాత్ర 100రోజులు పూర్తి అయిన సందర్భంగా మదనపల్లెలో సంఘీ భావంగా సోమవారం నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైకాపాకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మళ్లీ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ఖావడం ఖాయమన్నారు. అన్ని నియోజకవర్గాలతో పాటు రాజంపేట పార్లమెంటు సీటు కూడా గెలుపొందు తా రన్నారు. తొలుత పాదయాత్ర ఎన్‌టిఆర్ సర్కిల్ నుంచి చిత్తూరు బస్టాండు, అంబేద్కర్ సర్కిల్ మీదుగా శ్రీక్రిష్ణదేవరాయుల విగ్రహం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యేలు దొమ్మలపాటి రమేష్, షాజహాన్‌బాషా, టౌన్‌బ్యాంకు మాజీ ఛైర్మెన్ విద్యాసాగర్, రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎస్.ఎ.మస్తాన్, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మెన్ జోలిపాళెం భవానిప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెలుగుస్కూల్ కన్వీనర్‌కు ఘన సన్మానం

మదనపల్లె, మే 15 ప్రభాతవార్త :



వెలుగు ప్రత్యేక పాఠశాల కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆర్.భాగ్య లక్ష్మిని సోమవారం సీనియర్ సిటిజన్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ఘనంగా సన్మానించారు. కన్వీనర్‌ను ప్రతిభావంతుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం రాష్ట్రస్థాయి సలహామండలి ప్రతినిధిగా ఇటీవల నియమించబడిన విషయం తెలిసిందే. ఈ సందంర్భంగా ఆమెను సీనియన్ సిటిజన్ సభ్యులు పూలమాల వేసి శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో ధాత్రిఫౌండేషన్ వ్యవస్థాపకురాలు స్వాతి చక్రపాణి, గీతామురళి, సీనియర్ సిటిజన్ సభ్యులు అంకిరెడ్డి, బిటి కళాశాల కరస్పాండెంట్ వైఎస్. మునిరత్నం పాల్గొన్నారు.

## మదనపల్లెను జిల్లా చేయకపోవడం అన్యాయం

### టిడిపి, జనసేన, సిపిఐ నాయకులు

మదనపల్లె, మే 15 ప్రభాతవార్త :



జిల్లా కేంద్రానికి కావాల్సన అన్ని వసతులు మదనపల్లెకు ఉన్నా జిల్లా కేంద్రంగా చేయకపోవడం తీవ్ర అన్యాయమని టిడిపి మాజీ ఎమ్మెల్యే రమేష్, జనసేన పార్టీ నాయకులు రాందాస్‌చౌదరి, టిడిపి రాష్ట్ర మహిళా నాయకురాలు పర్వీన్‌తాజ్‌లు తెలిపారు. జిల్లా సాధనసమితి ఆధ్వర్యంలో గతంలో వీరు చేపట్టిన ఉద్యమాలు అప్పట్లో కేసులు నమోదు చేయడం జరిగింది. కేసులు సందర్భంగా సోమవారం వీరు కోర్టుకు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రం నుంచి 25మంది ఎంపిలను గెలిపించి కేంద్రానికి పంపితే రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై మాట్లాడిన ఊసే లేదన్నారు.మదనపల్లెకు తీవ్ర అన్యాయం చేసిన పెద్దరెడ్డి కుటుంబానికి వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యదర్శి క్రిష్ణప్ప, నాయకులు ఉట్టికొం డ త్యాగరాజు, సురేంద్రయాదవ్, వెంకటేశ్వర్లు, నూర్‌అహ్మద్, మొటుకు శివ, తలారి మంజు తదితరులు పాల్గొన్నారు.

## క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించండి

### కమిషనర్‌కు ఏఐటియుసి నాయకులు విన్నపం

మదనపల్లె, మే 15 ప్రభాతవార్త:



క్లాప్ ఆటోడ్రవర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటియుసి నాయకులు సోమవారం మున్సిపల్ కమీషనర్ ప్రమీలకు విన్నవించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కమీషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజా ఆరోగ్యం కాపాడడానికి మున్సిపాలిటిల్లో ఇంటింటా చెత్తసేకరణకు గానూ ఆటోలను తెప్పించడం జరిగిం దన్నారు. స్వచ్ఛసంకల్పం క్లాప్ ఆటో డ్రైవర్ల విషయంలో దళారీ వ్యవస్థను పూర్తిగా ఈ రాష్ట్రానికి తీసుకురావడం జరిగిందన్నారు. దళారీ వ్యవస్థను రద్దుచేసి ఆటో డ్రైవర్లకే అప్పగించాల్సిందిగా కోరారు. డ్రైవర్లను ఆప్కాస్ కింద చేర్చాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు కనీస వేతనం రూ.18500 లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతినెల మొదటి వారంలోనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బబ్లూ, లింగమూర్తి, అషీఫ్, రెడ్డిప్రసాద్, లోహిత్, సాధిక్ పాల్గొన్నారు.

## తీర్థయాత్రలకు ప్రత్యేక బస్సుసర్వీసులు

### ఆర్టీసి డిపో మేనేజర్ కుమార్

పీలేరు, మే 15 ప్రభాతవార్త:

తీర్థయాత్రలకు ప్రత్యేక బస్సులు నడపున్నట్లు డిపో మేనేజర్ కుమార్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ కెవి.రమణలు తెలిపారు. ఈనెల 20న మున్నారుకు ఒక సర్వీసు, 25వతేదీన భద్రాచలంకు నాలుగు బస్సు సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఈ బస్సులను మంత్రాలయ, శ్రీశైలం, తమిళనాడు, హైదరాబాద్ ముచ్చంతలకు ప్రత్యేక బస్సులు వేయనున్నట్లు తెలిపారు. పీలేరు డిపో నుంచి మంత్రాయంవెళ్ళి రాఘవేంద్రస్వామిదర్శనం, మహానంది, అహోబిలం, యాగంటి మీదుగా పీలేరుకు వచ్చునని తెలిపారు. టికెట్టు ధర ఒకొక్కరికి రాను, పోనూ రూ.1600లు మాత్రమే అన్నారు. హైదరాబాద్ ముచ్చంతలకు రానుపోనూ టికెట్టు ధర ఒకొక్కరికి రూ.1600లు ఉంటుందన్నారు. ఈనెల 29న శ్రీహరికోటలో రాకెట్ లాంచ్‌కు ప్రత్యేక బస్సుసర్వీసు వేశామని టికెట్టు ధర రూ.520లు మాత్రమే ఉంటుందన్నారు.

## ప్రత్యేక యోగ శిక్షణా కార్యక్రమం

పీలేరు, మే 15 ప్రభాతవార్త :

ప్రత్యేక యోగ విశ్వవిద్యాలయం వైశా బెంగుళూరు స్వామి వివేకానంద యోగ అనుసంధానసంస్థానంతో పీలేరులోని షి దివ్యయోగ విద్యాలయం అనుసందానం అయి ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పీలేరు పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని వారే కాకుండా ఇతర జిల్లాల యోగాభిలాషులకు పదవ తరగతి పాసై అయిన ప్రతిఒక్కరూ అర్హులు అన్నారు. యోగాను ఉపాధిగా తీసుకొని యోగ విద్యను బోధించుట, జబ్బులను తగ్గించడానికి ఈ కోర్సు ఉపయోగకరమని తెలిపారు. అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని ఈశిక్షణ పొందిన వారు యోగా ఉపాధ్యాయులు కాలగలరని తెలిపారు. మరిన్ని వివరాలకు 9948244442, 9059676789గల సెల్‌నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో పిఎస్ లక్ష్మీ పాల్గొన్నారు.

## పీలేరులో పర్యావరణ జీవనశైలి





పీలేరు, మే 15 ప్రభాతవార్త:

మండలంలోని పర్యావరణ జీవనశైలి కార్యక్రమంలో భాగంగా సోమారం పంచాయితీ సచివాలయ ఆవరణంలో పీలేరు అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామస్థులతో సమావేశమై విద్యుత్ ఆదా, నీటి ఆదా, ప్లాస్టిక్‌నిషేదం, ఆరోగ్య ప్రమాదమైన జీవనశైలి మొదలగు అంశాలపై ప్రజలకు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైష్ణవినగర్‌లో ఆర్‌ఓప్లాంటును తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టెస్టు బీట్ ఆఫీసర్ సుధాకర్, గిరినాథ్‌బాబు, వరదారెడ్డి, సుబ్బలక్ష్మి, రాజారెడ్డి, జ్యోతి, ఈఓ ప్రసాద్‌రెడ్డి, కాలనీ వాసులు చిన్నా, మల్లికార్జున సచివాలయ సెక్రటరీలు నవీన్, పద్మనాభం, బావాజి, భారతి, జిల్లా జాయింట్ సెక్రటరీ నాగరాజు, బాషా తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసాపై అవాగాహస సదస్సు

రామసముద్రం, మే 15

ప్రభాతవార్త:



మండల పరిధిలోని ప్రజాప్రతినిదులు, రైతుబరోసా సిబ్బందికి ఉద్యాన వన అధికారి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఉద్యానవన అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభు త్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను 5ఎకరాల లోపు పొలం ఉన్న రైతులకు 90శాతం రాయితీ, ఆపైన ఉన్న రైతులకు 70శాతం రాయితీ కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులరు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు తాను చేసిన పంటను ఈక్రాప్ నందు రిజిష్టర్ చేసుకొని ప్రభుత్వం అందించే పంటనష్టం పరిహారం క్రాప్ ఇన్సూరెన్స్, సున్నావడ్డీ, మద్దతు ధర పొందాలని తెలిపారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని కనీసం 5 పంచాయతీలో 5మంది రైతులకు ప్రకృతి వ్యవసాయంపై చేయించి మార్పులు చూపిస్తే రైతులు కూడా మారుతారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి రామచంద్రారెడ్డి, ఎంపిపి కుసుమకుమారి, సింగిల్‌విండో అధ్యక్షులు కేశవరెడ్డి, మండల కన్వీనర్ భాస్కర్ గౌడ్, మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మెన్ క్రిష్ణమూర్తి ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## మృత దేహానికి నివాళులు

వేంపల్లె, మే 15, ప్రభాతవార్త :



వేంపల్లె మండల యూత్ కన్వీనరు రవిశంకర్‌గౌడ్ తల్లి లక్ష్మిదేవి మృతి చెందారు. ఈ సంద ర్భంగా జడ్పీటీసీ సభ్యుడు రవి కుమార్ రెడ్డి ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

## జగనన్న కాలనీలను పట్టించుకోని అధికారులు

వేంపల్లె, మే 15, ప్రభాతవార్త :



వేంపల్లె పట్టణంలోని జగనన్న కాలనీలను అధికారులు పట్టించుకోలేదని వేంపల్లె ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోఆర్డినేటరు రహంతుల్లా, జిల్లా కోకన్వీనరు దాదాపీర్ అన్నారు. కాలనీలోని లబ్ధిదారులతో సోమవారం వారు మాట్లా డారు. సీసీ రోడ్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా లాంటి ప్రధాన సమస్యలున్నా పట్టించు కునే నాథుడే కరువయ్యారన్నారు. ఎలాగైనా ఇళ్లు నిర్మించుకోవాలని, లేనిపక్షంలో పట్టాలు వెనక్కు ఇవ్వాలని వాలంటీర్లు ఒత్తిడి చేస్తున్నారని ఆప్ నాయకులకు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆప్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆప్ మండల సభ్యులు పీర్‌బాషా, సమీర్, గౌస్ పాల్గొన్నారు.

## శివాలయంలో అన్నదానం

కడప వైద్యవిభాగం, మే 15, ప్రభాతవార్త:



కడప నగరం మృత్యుంజయ కుంట శివాలయంలో ఆదివారం హనుమత్ జయంతి సందర్భంగా అన్నదానం నిర్వహించారు. 11వ డివిజన్ ఏరియా ఇన్‌ఛార్జి కె.విజయ భాస్కర శర్మ ఆధ్వర్యంలో హనుమత్ జయంతి సందర్భంగా భక్తులకు పంచభక్ష పరమాణ్నాలతో భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్ శర్మ మాట్లాడుతూ హను మాన్ జయంతి సందర్భంగా శివాల యంలో మొదటి సారిగా అన్నదానం నిర్వహించామని ప్రతి సంవత్సరం హను మాన్ జయంతి రోజున ఇదే విధంగా అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. శివాలయంలో ఆంజనేయస్వామి దేవాలయం దినదినాభివృద్ధి జరుగుతుందని నూతన దేవాలయాన్ని నిర్మించబోతున్నామని తెలిపారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి దేవాదాయశాఖకు తెలిపామని గ్రాంట్స్ కూడా మంజూరు అయ్యాయని తెలిపారు. మల్లికార్జున, సోమ కళాధర్, శివ, విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

## పర్యావరణ జీవనశైలి



రామసముద్రం, మే 15 ప్రభాతవార్త:

మండలంలోని పర్యావరణ జీవనశైలి కార్యక్రమంలో భాగంగా సోమారం ఎల్లవానెల్లూరు పంచాయితీ సచివాలయ ఆవరణంలో మదనపల్లె అటవీశాఖ సిబ్బంది, గ్రామ సర్పంచ్ ఉదయ్‌శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులతో సమావేశమై విద్యుత్‌ఆదా, నీటి ఆదా, ప్లాస్టిక్‌నిషేదం, ఆరోగ్య ప్రమాదమైన జీవనశైలి మొదలగు అంశాలపై ప్రజలకు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌తో పాటు కురిజల సర్పంజ్ దొడ్డిపల్లె ఆనంద, మాజీ సర్పంచ్ వాళ్ళప్ప, సచివాలయ కన్వీనర్ చెన్నకేశవులు, అటవీశాఖ క్షేత్రాధికారి జె.మధన్‌మోహన్, బీట్ ఆఫీసర్, శ్రీదేవి, దీప, శోభ, కిరణ్, గ్రామస్థులు సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## అమీర్‌బాబుకు నాయకుల అభినందనలు

కడప వైద్యవిభాగ, మే 14, ప్రభాతవార్త:



కడప టీడీపీ ఇన్‌ఛార్జి అమీర్‌బాబు ఇటీవల కువైట్ ఎన్నారై టీడీపీ అభిమానుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా వెళ్లి కార్యక్రమం విజయవంతం చేసుకొని తిరిగి సోమవారం కడపకు చేరుకోవడంతో ఆయన్ను కడప సిటీ ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య ఆధ్వర్యంలో పూలమాలలు వేసి స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అమీర్ బాబు మాట్లాడుతూ టీడీపీ ఎన్నారై కువైట్‌లో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం రావడం ఖాయమని సీఎంగా చంద్రబాబు కావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, డివిజన్ ఇన్‌ఛార్జిలు బండి జయశేఖర్, పి.శ్రీనివాసులు, కొండ్రెడ్డి జనార్ధన్‌రెడ్డి, ఐటీడీపీ నగర అధ్యక్షులు వరకుమార్, ప్రధాన కార్యదర్శి మేకల దేవా, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కోయిలకుంట్ల శ్రీనివాసులు, కడప జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు నాదెల దస్తగిరి, అబ్దుల్ రాయల్ కరీముల్లా, నాయకులు షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలులో ఆర్పీలదే కీలక పాత్ర :– మెప్మా పీడీ

కడప ఎడ్యుకేషన్, మే 14, ప్రభాతవార్త:

ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలలోని సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందించాలని మెప్మా పీడీ వై.సురేష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో మెప్మా ఎండీ వి.విజయ లక్ష్మీ ఆదేశాల మేరకు వైఎస్ఆర్ అన్నమయ్య జిల్లాలోని ఎస్ఎల్ఎఫ్/ టీఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్లకు జిల్లా స్థాయి రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమం ఉద్దేశించి పీడీ మాట్లాడుతూ మొదటి బ్యాచ్ సంబంధించి జమ్మలమడుగు బద్వేలు ఎర్రగుంట్ల మున్సిపాలిటీ లోని రిసోర్స్ పర్సన్‌కు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటాయని మిగిలిన మున్సిపాలిటీలకు ఈనెల 31వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అలాగే ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి పేదవాడికి అందించాల్సిన బాధ్యత మెప్మాపై ఉందన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారులైన నాగరాజు, గోపినాథ్, ఐటీ యాంకర్ పర్సన్ శంకర్ ప్రసాద్, జిల్లా రిసోర్స్ పర్సన్లు జోసెఫ్, శోభ, చంద్రశేఖర్, బద్వేలు, జమ్మలమడుగు సీపీఎంలు గంగులయ్య, అయ్యవారయ్య మరియు ఆర్పీలు పాల్గొన్నారు.

## వంద రోజులకు చేరుకున్న లోకేష్ పాదయాత్ర

కడప వైద్యవిభాగ, మే 15, ప్రభాతవార్త:



తెదేపా కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సోమవారానికి వంద రోజుల సందర్భంగా కొండాయపల్లె ఎన్టీఆర్ విగ్రమం వద్ద నుంచి వన్‌టౌన్, గాంధీ బొమ్మ దగ్గరకు పాదయాత్రగా తెదేపా నాయకులు, కార్యకర్తలు పాదయాత్రం చేశారు. ఈ పాదయాత్రలో నాయకులతో తెదేపా బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కోయిలకుంట్ల శ్రీనివాసులు అలియాస్ నబీకోట శ్రీనివాసులు, బత్తల శ్రీని వాసులు, మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## శబ్ధ కాలుష్యం చేసే సైలెన్సర్లు వాడితే బైక్‌లు సీజ్

కడప క్రైం, మే 15, ప్రభాతవార్త:

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప టుటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం ఎస్సై జయరాములు దాడులు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలకు కాలుష్య ప్రమాణాల నిబంధనలు ఉల్లంఘించి బుల్లెట్ వాహనాల సైలెన్సర్లను మార్చి నడుపుతున్న వారికి ఆయన జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శబ్ధ కాలుష్యం చేసే ఇతర సైలెన్సర్లు వాడితే బైక్‌లు సీజ్ చేస్తామని ఆయన యువతకు, వాహనదారులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆహారపు అలవాట్లలో మార్పులతో సంపూర్ణ ఆరోగ్యం

### – సాదక్ స్పెషాలిటీ హాస్పిటల్ డా॥ ఎస్.హుస్సేన్



బద్వేలు అర్బన్, మే 15 ప్రభాతవార్త :

ప్రతి ఒక్కరూ ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఇంటిలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్న పుడే ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని సాదక్ స్పెషాలిటీ హాస్పిటల్ డా॥ ఎస్.హుస్సేన్ అన్నారు. ఈ సందర్భంగా సాదక్ హాస్పిటల్ డా॥ హుస్సేన్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు తినే ఆహారంలో పరిశుభ్రత ఉండేలా ప్రతి ఒక్కరూ చూసుకోవాలన్నారు. పరిశుభ్రంగా లేని ఆహారం తీసుకోవడం వలన అనేక రకాల వ్యాధులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటిలోని పరిసరాలను కూడా ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకుంటూ ఉండడం వలన ఎటువంటి అనారోగ్యా నికి గురి కాకుండా ఉండవచ్చన్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని, వాటి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎవరికైనా దగ్గు, జలుబు, జ్వరం లాంటి లక్షణాలు కన్పిస్తే ప్రాథమిక దశలోనే సంబంధించిన వైద్యులను సంప్రదించి తగిన సలహాలు, సూచనలు తీసుకోవడం వలన అనారోగ్యానికి గురికాకుండా ఉండవచ్చన్నారు. అలాగే ఆహారపు అలవాట్లలో కూడా మార్పులు చేసుకోవాలని, ఆకు కూరలు, పాలు, గుడ్లు లాంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం నడక, యోగ, వ్యాయామం లాంటివి పాటించడం ద్వారా అనారోగ్యానికి గురికాకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని, ఎటువంటి అనారోగ్య సమస్యలు ఏర్పడినా నిర్లక్ష్యం వహించకుండా వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

## రెండు ఇళ్లలో చోరీ



మదనపల్లెక్రైం, మే 15 ప్రభాతవార్త :

రెండు ఇళ్లలో చోరీ జరిగిన సంఘటన మదనపల్లెలో సోమవారం జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. మదనపల్లె పట్టణం గజ్జలకుంటకు చెందిన శ్రీనివాసులు, సుగుణలు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరు ఉదయం ఇంటికి తాళం వేసు కుని పొలం వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చి చూడగా తలు పు తెలిచి వుంది. దీంతో ఇంట్లోకి వెళ్లి గమనించగా బీరువా తాళం పగలగొట్టి అందులో వున్న 35 గ్రాముల బంగారం, రూ.2,75,000ల నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే చీకలబైలు పంచాయితీ బార్లపల్లికి చెందిన ప్రసాద్‌రెడ్డి ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి ఊరికి వెళ్లారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో దొంగలు తాళం పగలగొట్టి రూ.6లక్షల విలువ చేసే బంగారం, వస్తువులు, నగదును చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసిన సిఐ సత్యనారాయణ దర్యాపు చేస్తున్నారు. ఇదిఇలా వుండగా ఆదే గ్రామంకు చెందిన ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## దేవాదాయ భూములు అధికారులకు పట్టవా

**– 14వ రోజుకు చేరిన నిరాహారదీక్ష**



**లక్కిరెడ్డిపల్లె, మే 14, ప్రభాతవార్త:**

మండల తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా అనంతపురం గంగమ్మ తల్లి ఆలయం చుట్టూ ఉన్న ప్రభుత్వ, ఎండోమెంట్ భూముల ఆక్రమణకు నిరసనగా చేస్తున్న నిరాహారదీక్ష సోమవారం 14వరోజుకు చేరుకుంది. దీక్షను ఉద్దేశించి అన్నమయ్య జిల్లా బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి జానం బాలాజీ యాదవ్ ప్రసంగిస్తూ అమ్మవారి ఆలయ భూముల పరిరక్షణ సమితి కన్వీనర్ కొండూరు వెంకటరామరాజు, కోకన్వీనర్ చెంచర్ల ఆంజనేయులు, వీహెచ్‌పీ లక్కిరెడ్డిపల్లె ప్రఖండ అధ్యక్షులు ఎస్సార్ ఆంజనేయరెడ్డి, రామాపురం మండల వీహెచ్‌పీ ఉపాధ్యక్షులు ఎంవీ భాస్కర్‌రెడ్డిల ఆధ్వర్యంలో లక్కిరెడ్డిపల్లె మండలంలోని అనంతపురం గంగమ్మ దేవాలయం చుట్టూ ఉన్న ప్రభుత్వ మరియు ఎండోమెంట్ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని గత 14 రోజుల నుంచి సంఘ సభ్యులు మరియు వీహెచ్‌పీ సభ్యులు మరియు గంగమ్మ భక్తులు నిరసన నిరాహారదీక్షలో పాల్గొని వివిధ రకాల ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో లక్కిరెడ్డిపల్లె మండల తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, లక్కిరెడ్డిపల్లె ఎస్సై మల్లికార్జునరెడ్డి చొరవ తీసుకొని సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి తొందరలోనే సమస్యను పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తామనడంతో సంఘ సభ్యులు తాత్కాలిక విరమణ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు తిరుపతి శ్రీరాములు, తిరుపతి ఈశ్వరయ్య, తిరుపతి వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ రాజేంద్రరెడ్డి, ఎర్రగుడి వైసీపీ నాయకులు రామయ్య, మురికినాటి ఇంద్రసేన, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కుడుముల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల్లో సృజనాత్మకత వెలికితీయడమే లక్ష్యం

**వేంపల్లె, మే 15, ప్రభాతవార్త ః**




మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యమని ధన్య టీవీ సీఎండీ రమేష్‌బాబు అన్నారు. మదర్స్‌డే సందర్భంగా మా ఇంటి వంట కుకింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ పోటీలలో వేంపల్లె ఐఈఆర్టీ యశోద మొదటి స్థానంలో నిలిచి గ్యాస్‌స్టౌ బహుమతిగా పొందారు. ఈ వంట కార్యక్రమాన్ని ధన్య టీవీలో ప్రసారం చేశామని, ఎక్కువ వ్యూస్ వచ్చిన వీడియోకి బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు.

## మినీ మహానాడు విజయవంతం చేయండి

**– మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**



**రాయచోటి, మే 15ప్రభాతవార్త:**

స్వర్గీయ నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలలో భాగంగా రాయచోటి రాజధాని కళ్యాణ మండపంలో మంగళవారం జరిగే మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మధ్యాహ్నం 2 గంటలకు హాజరై విజయవంతం చేయాలని రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు.

## లోకేష్ పాదయాత్రలో టీడీపీ కార్యకర్తలకు భరోసా

**– రాజంపేట పార్లమెంటు ప్రధాన కార్యదర్శి నాగమునిరెడ్డి**



**సిద్దవటం, మే 14, ప్రభాతవార్త:**

మండలంలోని టక్కోలి గ్రామంలో నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తయిన సందర్భంగా టీడీపీ రాజంపేట ఇన్‌ఛార్జి బత్యాల చెంగల రాయుడు ఆదేశాల మేరకు మండలంలోని బీసీ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకోవడమైనదని రాజంపేట పార్లమెంటు ప్రధాన కార్యదర్శి నాగమునిరెడ్డి తెలిపారు. యువగళంలో అన్ని వర్గాల వారికి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే న్యాయం చేస్తానని హామీ ఇస్తూ నారా లోకేష్ పాదయాత్రకు ప్రజలందరూ స్వచ్ఛందంగా స్వాగతం పలుకుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం దౌర్జన్యాలకు టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్న టీడీపీకి సేవ చేసే వారందరికీ పేరు పేరునా ధైర్యం చెబుతూ రాబోయేది మన ప్రభుత్వమే అని నేనున్నానని భరోసా ఇస్తూ ముందుకు సాగిపోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు, పార్లమెంటు వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి చలపాటి చంద్ర, బీసీ సెల్ అధికార ప్రతినిధి జింక శివ, బూతు కన్వీనర్ బండి ఓబులేసు, మాజీ సర్పంచ్ ఎరికలయ్య, జింకా ఓబులేసు, షేక్ ఖదీరుల్లా, రాయని భద్రయ్య, సుబ్బరాయుడు, రాహుల్ మరియు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చైన్ స్నాచర్ అరెస్ట్

**– 120 గ్రాములు బంగారు స్వాధీనం**




**ఓబులవారిపల్లె, మే 15, ప్రభాతవార్త:**

ఓబులవారిపల్లె మండలంలో ఇటీవల దాదాపు 8 మంది వద్ద నడిచి వెళ్తున్న మహిళలను దిగబెడతామని నమ్మించి వారి మెడలోని మంగళసూత్రాలను, చైన్లను లాక్కెళ్లి జీవించేవాడని రాజంపేట డీఎస్పీ తెలిపారు. ఆయన వివరాల మేరకు పుల్లంపేట మండలం పీవీజీపల్లె గ్రామం వెంకట సుబ్బయ్య అనే వ్యక్తి కొన్ని సంవత్సరాలుగా చైన్ స్నాచర్ వృత్తిని ఎంచుకొని ఒంటరిగా వెళ్తున్న మహిళలను ఎంచుకొని వారి వద్ద ఉన్న బంగారు వస్తువులు లాక్కెళ్లేవాడన్నారు. ఈ మధ్య కాలంలో ఈనెల 11వ తేదీన ఓబులవారిపల్లె టౌన్‌లో రైల్వే తూము వద్ద మహిళ మెడలో నుంచి బంగారు సరుడు లాక్కెళ్లడంతో సీసీ ఫుటేజీ ఆధారంగా గొలుసు దొంగను విచారించగా 120 గ్రాములు బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్లు ఒప్పుకున్నాడన్నారు. ఇతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోడూరు సీఐ విశ్వనాథ్‌రెడ్డి, ఓబులవారిపల్లె ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

**దువ్వూరు, మే 14, ప్రభాతవార్త:**

గతంలో ఉద్యోగులకు పింఛనర్లకు ఉన్న సౌకర్యాలను ప్రస్తుత ప్రభుత్వం హరిస్తోందని అలా కాకుండా సామరస్యంగా ఉద్యోగుల, పింఛనర్ల సమస్యలు పరిష్కరించాలని మండల పింఛనర్ల సంఘం అధ్యక్షుడు సూర్యకృష్ణయ్య అన్నారు. పోరాటాల ద్వారా వేతన సవరణలో కొన్ని ప్రయోజనాలు ఉద్యోగులకు వచ్చాయని వాటిని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం ఉద్యోగులు, పెన్షనర్లు జీతాల కోసం వేచి చూడాల్సి వస్తోందని 1వ తేదీ రావాల్సిన జీతాలు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి ఉందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు కోటీశ్వరులు కాదని వచ్చే జీతాలు, పింఛన్లతోనే వారు బతుకుబండి నడవాలని కావునా రావాల్సిన జీతాలు వారికి సకాలంలో ఇచ్చి ఆదుకోవాలన్నారు.

## వైభవంగా పంచముఖ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

**కడప వైద్యవిభాగం, మే 15, ప్రభాతవార్త:**



కడప నగరం నెహ్రూనగర్‌లో వెలసిన శ్రీపంచముఖ ఆంజనేయస్వామి 26వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈనెల 14వ తేదీ ఉదయం 7 గంటలకు పంచామృతాభిషేకం, ఆకు పూజ, మన్యు సూక్త హోమం, రుద్ర హోమం, లక్ష్మీ హోమం, పూర్ణాహుతి మంగళ హారతి, ధ్వజారోహణం, మంత్రపుష్పం తీర్థ ప్రసాద వినియోగం జరిగాయి. అనంతరం 12 గంటల నుంచి భక్తులకు అన్నదాన సంతర్పన కార్యక్రమం జరిగింది.5 గంటల నుంచి గ్రామోత్సవం మెరవాణి కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ టి.శ్రీధర్‌రావు, జి.వెంకటసుబ్బయ్య ఎలక్ట్రిషన్, కె.ఓబులేసు స్టాంప్ రైటర్ చిన్నపరెడ్డి, రామకృష్ణారెడ్డి, సునంద మజారే లక్ష్మీనారాయణమ్మ, ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవ కమిటీ గొడ్డేటి బాలరాజు, గురయ్యపల్లె, వెంకట సుబ్బయ్య అండ్ బ్రదర్స్ విడతల వెంకట్ నారాయణ బీరు గంగరాజు, దొంతు వెంకటాచలం, శ్రీనివాసులు, పొలతల రామచంద్రయ్య, గొంటుముక్కల గోపాల్, గ్రామ పెద్దల సహకారంతో గ్రామోత్సవం జరిగింది.

## గ్రామాలవారిగా హౌసింగ్‌పై చర్చ

**పుల్లంపేట, మే 15 ప్రభాతవార్త**



పుల్లంపేట మండలంలో హౌసింగ్ శాఖపై గ్రామాలవారిగా సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలానికి సొంత ఇంటిస్థలం కలిగినవారి కోసం 160 పక్కా గృహాలు మంజూరు కావడంతో వాటికి లబ్దిదారుల ఎంపిక కోసం ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆయన దిశ నిర్దేశం చేశారు. ఆన్‌లైన్‌లో లబ్దిదారుల పేర్లను నమోదు చేయాలంటే ముందుగా లబ్దిదారుల సమాచారం పూర్తిగా తెలుసుకుని బేస్‌మట్టం, గోడలు ఉంటే వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన వారికి వివరించారు. సోమవారం సాయంత్రం లోగా వీఆర్ఓ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కలిసి పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించుకొని నిజమైన లబ్దిదారులా లేదా అనే విషయాలను తెలుసుకుని ఆ తర్వాత రిపోర్టు ఇవ్వాలని వారిని ఆదేశించారు. అవసరం అనుకుంటే లబ్దిదారుల్లో ఏదైనా ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం లేకపోతే జాబితా నుంచి తొలగించాలని కూడా ఆయన ఆదేశించారు. ప్రస్తుతం తయారు చేసిన జాబితాలో కొని పేర్లు రెండంతస్తుల మిద్దెలు ఉన్నవి కూడా నమోదు చేశారని, తమ విచారణలో అవి బయటపడ్డాయని, తొలగించాలని వివరించారు. ఆదివారం సెలవు దినం అయినా రెవెన్యూ సిబ్బంది అందరూ పనిచేసి క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తహశిల్దారు కుమార్‌తో పాటు ఎండిఓ ప్రకాశం, హౌసింగ్ ఎఇ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, విఆర్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు బహుమతి పంపిణీ

**పుల్లంపేట, మే 15 ప్రభాతవార్త**



పుల్లంపేట మండలం ఎస్‌బివిడి సభ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు పొందిన ఐదుగురు విద్యార్థినులకు పుల్లంపేటకు చెందిన బోగా పార్థసారథి కుటుంబం నగదు బహుమతులను సోమవారం పంపిణీ చేశారు. ఎస్‌బివిడిలో ఇటీవల వచ్చిన పదో తరగతి ఫలితాల్లో అత్యధికంగా 512 మార్కులు పొందిన పి.భావనకు 10 వేల రూపాయలు, 501 మార్కులు పొంది న హజీజాకౌషార్‌కు 8 వేల రూపాయలు, 476 మార్కులు పొందిన గౌతమికి 6 వేల రూపాయలు, 464 మార్కులు పొందిన మేఘనకు 4 వేల రూపాయలు, 462 మార్కులు పొందిన తరుణ్‌కుమార్‌కు 3 వేల రూపాయల బహుమతులను ఆయన తండ్రి బోగా వెంకటరమణయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు బోగా వెంకటరత్నమ్మలు కలిసి ఈ బహుమతులను పంపిణీ చేయడం జరిగిందని వైఎస్‌ఆర్‌సిపి నాయకులు బోగా పార్థసారధి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నూకల శ్రీరాములు, ప్రధానోపాధ్యాయులు మురళిరెడ్డి, నూకల మురళి, అవ్వారు శ్రీను పాల్గొన్నారు.

## అపర భగీరథుడు కాటన్ దొర

**వేంపల్లె, మే 15, ప్రభాతవార్త ః**



స్వర్గీయ సర్ ఆర్థర్ కాటన్ దొర అపరభగీరథుడు అని, నదుల అ నుసం ధానానికి ఆద్యుడని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్. తులసిరెడ్డి కొనియాడారు. సోమవారం వేంపల్లెలో కాటన్‌దొర 220వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కాటన్‌దొర ఆంగ్లేయుడైనప్పటికీ సమాజసేవ పరమావధిగా భావించి భారతీయుల, ప్రత్యేకించి ఆంధ్రుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. గోదావరి నదిమీద దవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి కరవు పీడిత ప్రాంతాలైన ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన మహనీయుడు కాటన్ దొర అన్నారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో నాయకులు సుబ్రమణ్యం, రామక్రిష్ణ, చెన్నకేశవ, నరసింహారెడ్డి, ఉత్తన్న, బద్రి, రాఘవయ్య, వేమయ్య, శివ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## యువగళం 100వ రోజు సంఘీభావయాత్ర



**పోరుమామిళ్ళ రూరల్, మే 15ప్రభాతవార్త:**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా లోకేష్ యువగళం పాదయాత్ర 100వ రోజు సందర్భంగా సోమవారం పోరుమామిళ్ళలో బద్వేలు టిడిపి యువ నాయకులు కె.రితీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సంఘీభావ పాదయాత్రం నిర్వహించారు. ఈ పాదయాత్ర పోరుమామిళ్ళ పట్టణంలో ఆంజనేయ స్వామి దేవాలయం నుండి బద్వేల్ రోడ్డున ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు ర్యాలీగా బానా సంచాలు పేలిస్తూ సంఘీభావ యాత్ర ఘనం నిర్వహించారు.కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనా న్నరు.

## అన్నమాచార్యలో ప్రశాంతంగా ఎంసెట్ ఆన్‌లైన్ పరీక్షలు

**రాజంపేట అర్బన్, మే 15 ప్రభాతవార్త**



స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నుంచి ఎంసెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 23వ తేది ఎంసెల్ ఆన్‌లైన్ పరీక్షలు జరుగుతాయని అందుకు పక్కా ఏర్పాట్లు చేసినట్లు అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ తెలిపారు. మొత్తం తమ కేంద్రంలో 2700 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మొదటిరోజు 349 పరీక్షలకు హాజరైనట్లు పేర్కొన్నారు.

## చక్కటి పాలనకు జగనన్నే సార్థకం



**రైల్వేకోడూరు రూరల్, మే 15 ప్రభాతవార్త**

రైల్వేకోడూరు మండలంలోని శ్రీవేంకటేశ్వరపురం ఎస్‌టికాలనిలో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని విచారించడం, పథకాల పట్ల ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయడం ప్రజారంజక పాలనతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ముఖ్యంగా వైసిపి ప్రభుత్వానికి మంచిపేరు ప్రజల్లో ఉందని ఆయన అన్నారు. ఎక్కడికి వెళ్లినా వైసిపి ప్రభుత్వంలో పలురకాల పథకాలు ద్వారా లబ్ధి పొంది ఉన్నామని వారు అనడం జరుగుతున్నదని ఆయన అన్నారు. అదేవిధంగా బడుగు బలహీనవర్గాల వారికి పూర్తిస్థాయిలో వైసిపి ప్రభుత్వంలో చక్కటి ఫలితాలు, పథకాలు అందుబాటులో ఉన్నాయని ఆయన అన్నారు. గిరిజనుల్లో చక్కటి సంతోషాలను వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, జడ్‌పిటిసి పాలెంకోట రత్నమ్మ, సర్పంచ్ బుడిగి శివయ్య, రమేష్, రాజా, హేమనవర్మ, చందు, బత్తల సుబ్రమణ్యం, బుల్లెట్ శివ, రమణారెడ్డి, రాజారెడ్డి, మల్లు క్రిష్ణారెడ్డి, సిద్దయ్య, గంగయ్య, కొప్పల శంకరయ్య, వైఎస్ కరిముల్లా, మహేశ్వర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు ముగింపు

**పుర వీధులలో దర్శనమిచ్చిన ఆంజనేయ స్వామి**

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**



**బద్వేలు అర్బన్, మే 15 ప్రభాతవార్త :**

హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకొని బద్వేలు పట్టణంలోని పోరుమామిళ్ళ రోడ్ ఎగువ బ్రాహ్మణ వీధి నాగులచెరువు కట్ట వద్ద వెలసిన వీరాంజనేయ స్వామి దేవాలయంలో ఆంజనేయ స్వామి జయంతి వేడుకలను రెండు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని వేద పండితులు అన్నదానం సుబ్రమణ్యం మంత్రోచ్ఛరణల మధ్య తెల్లవారుజాము నుండే ఆంజనేయ స్వామికి పంచామృతా భిషేకం, సింధూరం అర్చన, ఆకు పూజతో పాటు పలు రకాల విశేష పూజలను వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఛైర్మెన్ సన్నిబోయిన సుబ్బరాయుడు (గుజరాత్), వైస్ ప్రెసిడెంట్ ఇరగబోయిన చెన్నయ్య, సెక్రటరి దొండపాటి వెంకట రమణ, ట్రెజరర్ దూళ్ళ రమేష్‌తో పాటు పలువురు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారిని దర్శించుకునేందుకు విశేష సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వీరాంజనేయ స్వామివారిని పుర వీధులలో గ్రామోత్సవంగా బాణసంచా కాలుస్తూ రకరకాల కుంకుమలు చల్లుకుంటూ పండుగ వాతావరణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య స్వామివారి గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అడుగడుగునా భక్తులు స్వామివారికి మంచినీరు వారపోసి కాయా కర్పూరం సమర్పించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. గ్రామోత్సవం వెంబడి విశేష సంఖ్యలో భక్తులు, కమిటీ సభ్యులు, పుర ప్రజలు పాల్గొని జై శ్రీరామ్, జై జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ పుర వీధులలో మార్మోగే విధంగా స్వామివారిని స్మరించుకోవడం జరిగింది.

## అట్టహాసంగా వృషభరాజములచే బండలాగుడు పోటీలు

**మొదటి బహుమతి కైవశం చేసుకున్న బాపట్ల వేటపాలెం వృషభరాజములు**

**ప్రొద్దుటూరు, మే 15 ప్రభాతవార్త :**



ప్రొద్దుటూరు పట్టణంలో వెలసిన నూతన శ్రీ కోదండరామ దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అట్టహాసంగా వృషభరాజముల బండలాగుడు పోటీలను మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలలో మొత్తం 14 జతల వృషభరాజ్యములు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతి వృషభరాజముల జతకు 20 నిమిషాల సమయాన్ని కేటాయించామని ఆ సమయంలో తిరిగిన మీటర్లను అంచనా వేసి బహుమతులను నిర్ణయిస్తామన్నారు. అందులో భాగంగా మొదటి బహుమతి బాపట్ల వేటపాలెం కు చెందిన ఆర్కే శిరీష్ చౌదరి శివకృష్ణ చౌదరిలకు చెందిన వృషభరాజములు కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రెండవ బహుమతిగా బాలాపూర్ కు చెందిన ప్రసన్న రెడ్డి కైవసం చేసుకోగా మూడవ బహుమతి ప్రొద్దుటూరు మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన చంద్రబాబు రెడ్డి వృషభరాజ్యములు చేసుకున్నాయని తెలిపారు. నాలుగు ఐదు ఆరు ఏడు ఎనిమిది బహుమతులు కైవసం చేసుకున్న వారుఏ పి ఆర్ పల్లి నాగయ్య మార్తల చంద్రబాబు రెడ్డి మేకల వెంకట్రాముడు కమ్మ సాబు గారి రసూల్ జగన్మోహన్ రెడ్డి లు ఉన్నారు. ఈ పోటీలు అత్యంత ఉత్సాహభరితంగా కొనసాగాయి. మొదటి బహుమతి కైవసం చేసుకున్న వారికి 32 వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి బహుమతి ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో మార్తల రామచంద్రారెడ్డి జి గురుశేఖర్ రెడ్డి మార్తల ముని రెడ్డి దేవి రెడ్డి చిన్ని రెడ్డి మల్లికార్జున యాదవ్ మేరువ ప్రసాద్ హరీష్ జి లక్ష్మీనారాయణ అనిల్ రెడ్డి ఉదయ్ కుమార్ రెడ్డి బద్వేలు గురువు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శివునికి అభిషేకం



**బద్వేలు అర్బన్, మే 15 ప్రభాతవార్త :**

పట్టణంలోని శ్రీకృష్ణ దేవరాయ నగర్ సమీపంలో వెలసిన శ్రీశ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు సత్యనారాయణ శర్మ, రమేష్ శర్మల ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున స్వామివారి స్పటిక లింగానికి పంచామృతాభిషేకంతో పాటు వివిధ రకాల ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలువురు భక్తులు తెల్లవారుజాము నుండే స్వామివారిని దర్శించుకొని కాయా కర్పూరం సమర్పించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. ప్రత్యేక ఉభయదాతలుగా బిఎస్ఎన్ఎల్ జేఈ పెసల ఆంజనేయ రెడ్డి, సతీమణి శశికళ కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు వంకెల పోలిరెడ్డి, కమిటీ సభ్యులు గాలిబోయిన విష్ణు, ఆలయ నిర్వాహక అధ్యక్షులు కొప్పోలు చిన్నపరెడ్డి, దుద్దుకూరు సత్యనారాయణ, బైసాని వీరారెడ్డి, ఆవులేటి వెంకటసుబ్బయ్య, బసివి ఆదినారాయణ, ఆవుల వెంకట రమణ, దూపాటి నారాయణ, ఆలయ కమిటీ ఛైర్మెన్ రామనబోయిన మురళీ కుటుంబ సభ్యులు ప్రత్యేక ఉభయదాతలను శాలువాతో సత్కరించి స్వామివారికి పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు బిఎస్ఎన్ఎల్ జే ఈ పెసల ఆంజనేయ రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

## రిటైర్డ్ ఆర్ అండ్ బి డిఈ రామకృష్ణా రెడ్డి సేవలు అభినందనీయం

**– మున్సిపల్ కమీషనర్ కల్లూరు వెంకట కృష్ణారెడ్డి**



**బద్వేలు అర్బన్, మే 15 ప్రభాతవార్త :**

కరోనా కష్ట కాలంలో సైతం నిరుపేద ప్రజలకు చేయూతనివ్వడంలో రిటైర్డ్ ఆర్అండ్‌బి డిఈ పాలకొండు రామకృష్ణా రెడ్డి అందిస్తున్న సేవలు సంతోషకరమని మున్సిపల్ కమీషనర్ కల్లూరు వెంకట కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మైదుకూరు రోడ్‌లోని చలివేంద్రం వద్ద రిటైర్డ్ ఆర్ అండ్ బి డిఈ పాలకొండు రామకృష్ణా రెడ్డి సహకారంతో 500 మందికి పైగా మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని మున్సిపల్ కమీషనర్ కృష్ణారెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ముందుగా రామకృష్ణా రెడ్డికి శాలువా కప్పి సత్కరిస్తూ అభినందించారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో గత రెండు దఫాలుగా బద్వేలు ప్రాంతంలో అనేక నిరుపేద కుటుంబాలకు రిటైర్డ్ ఆర్ అండ్ బి డిఈ పాలకొండు రామకృష్ణారెడ్డి సహకారంతో అవసరమైన నిత్యావసర సరుకులు అందజేయడమేగాక కోవిడ్ కిట్లను కూడా అందజేస్తూ పేద ప్రజలకు ఆసరాగా నిలిచారన్నారు. అలాగే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తి తీర్చుట కొరకు మజ్జిగ వితరణ కార్యక్రమం చేపట్టడం సంతోషకరం అన్నారు. రాబోవు రోజులలో కూడా కష్టాల్లో ఉన్న నిరుపేదలకు చేయూతనిచ్చే లక్ష్యంతో తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందజేస్తామని రిటైర్డ్ ఆర్ అండ్ బి డిఈ పాలకొండు రామకృష్ణా రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యనారాయణ శిల్క్స్ యజమాని ముచ్చర్ల సత్యనారాయణ, వాసవీ క్లబ్ ట్రెజరర్ పెసల సుధాకర్, చెక్కా అనిల్, ఉరిమి నాగేంద్ర, నేలపాటి బాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సరాదాగా ఈతకు వెళ్లి బాలుడు మృతి

**నందలూరు, మే 15 ప్రభాతవార్త**



నందలూరు మండలం నాగిరెడ్డి పల్లె మేజర్ పంచాయతిలోని గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్న సురేంద్ర, జ్యోతిల పెద్దకుమారుడు సంతోష్(16) మిత్రులతో కన్యకచెరువు గుంతల్లో సరదాగా ఈతకు వెళ్లి మృత్యువాత పడినట్లు ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు. సంఘటన స్థలాన్ని మన్నూరు సిఐ పుల్లయ్యతో పరిశీలించడం జరిగిందని అన్నారు. దీనిపై పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని అన్నారు.

## నందలూరు నూతన ఎస్ఐగా వై.చెన్నకేశవ

**నందలూరు, మే 15 ప్రభాతవార్త**



అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సైబర్‌క్రైమ్ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ నందలూరు ఎస్ఐగా బదిలీ అయినట్లు తెలిపారు. ఆయన గతంలో పుల్లం పేట, రాజంపేట అర్బన్ , పెనగలూ రు పోలీసుస్టేషన్‌లో పనిచేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ చెన్నకేశవ మండలంలో శాంతిభద్రలకు ఇబ్బందులు కలగకుండా ప్రజలు మెలగాలని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తెలిపారు.

## టీడీపీ పాదయాత్రలో పాల్గొన్న సంబేపల్లె పసుపు దళం

**సంబేపల్లె, మే 15, ప్రభాతవార్త:**



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి యువ నాయకులు నారా లోకేష్ బాబు పాదయాత్ర సంఘీభావంగా సోమవారం టీడీపీ ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు సంబేపల్లె మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు చిన్నరెడ్డి యాదవ్, క్లస్టర్ ఇన్‌ఛార్జి మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, నూరు ఎకరాల రంగారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసారెడ్డి మాట్లాడుతూ నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రాయచోటి నియోజకవర్గం తెదేపా ఇన్‌ఛార్జి రమేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్రతో రాష్ట్రంలో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో తెదేపాను గెలిపించాలని చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని, రమేష్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యేగా చేయాలన్నారు. పాదయాత్రలో గోపినాథ్‌రెడ్డి, సుబ్బరాజు యాదవ్, నాగార్జునరెడ్డి, హరి,కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై స్పందన కార్యక్రమం

**– ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీన**

**బ్రహ్మంగారి మఠం, మే 15 ప్రభాతవార్త :**

మండల పరిధిలోని తోట్లపల్లె పంచాయతీలో గ్రామాల వారీగా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు మండల స్థాయి అధికారులు మరియు ప్రజా ప్రతినిధులతో మండల ప్రత్యేక అధికారి నరసింహా రెడ్డితో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. తోట్లపల్లె గ్రామంలో డ్వాక్రా మహిళలు ట్రైనీ కలెక్టర్‌తో ఏపిఎం ప్రకాష్ పైన తోట్లపల్లె క్లస్టర్‌లో 50 డ్వాక్రా సంఘాలు ఉండగా కొందరికి స్త్రీ శక్తి రుణాలు మంజూరు కాగా, అందులో ఒకటి పాత బకాయిల క్రింద ఉండడంతో ఆ బకాయిలను కడితే స్త్రీ శక్తి రుణాలు మంజూరు చేస్తామని డ్వాక్రా మహిళలతో ఏపిఎం ప్రకాష్ చెప్పారని, స్త్రీ శక్తి రుణాల బకాయిలు చెల్లించేందుకు బయట వడ్డీలు తెచ్చి చెల్లించామని, ఇప్పుడు రుణం మంజూరు చేస్తే అప్పులు కడుతామని ఏపిఎం ప్రకాష్‌ను కోరగా ఆయన డ్వాక్రా మహిళలను అసభ్య పదజాలంతో మాట్లాడుతూ స్త్రీ శక్తి రుణాలన్నిటిని బ్లాక్‌లో పెట్టడం జరిగినది ట్రైనీ కలెక్టర్‌తో డ్వాక్రా మహిళలు చెప్పగా స్పందన కార్యక్రమంలో అర్జీ రూపంలో అందిస్తే పై అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూపుతామని డ్వాక్రా మహిళలతో అన్నారు. రెవిన్యూ సమస్యలు కూడా అధికంగా ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్ళగా ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే గ్రామాలలో పర్యటిస్తున్నానని, ఇచ్చిన హామీలను త్వరలో పరిష్కారమయ్యే విధంగా చొరవచూపుతానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఈశ్వరయ్య, ఎంపీడీవో వెంగమునిరెడ్డి, ఎంపీపి వీరనారాయణ రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, పంచాయతీరాజ్ ఏఈ ప్రతాప్ రావు, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, హౌసింగ్ ఏఈ నాగజ్యోతి, ఉపాధి ఏపివో వసంత కుమార్, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



# వార్త 29వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 16 మే 2023







# కాలజ్ఞాన సహిత శ్రీ వీరబ్రహ్మేంద్ర

## స్వాముల వారి జీవిత చరిత్ర



కడప జిల్లా ఎందరో మహానుభావుల పుణ్యభూమిగా కడపకు ఎంతో చారిత్రాత్మక ప్రశస్తి ఉంది. భూత, భవిష్యత్ కాలజ్ఞానాన్ని రచించిన రాజయోగి శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సజీవ సమాధి నిష్ట వహించిన దివ్య క్షేత్రమైన కందిమల్లాయపల్లె (బ్రహ్మంగారి మఠం) ఈ నాడు దక్షణ భారత దేశము నందు ప్రసిద్ధిగాంచిన పుణ్య క్షేత్రాలలో ఒకటిగా వెలుగొందుతోంది. ఈ క్షేత్రం ఆవశ్యకతను ప్రతి ఒక్కరు తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. కలియుగంలో అధర్మం పెచ్చురిల్లి అన్యాయం మితిమీరినపుడు దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకై 17వ శతాబ్ధంలో నెలకొన్న పరిస్థితులను చక్కదిద్దటానికి వీరబ్రహ్మేంద్ర స్వామిగా అవతరించారు. కర్ణాటక రాష్ట్రంలో పాపాగ్ని మఠాధిపతులైన యనమదల వీరబోజాచార్యులు, వీరపాపమాంబ దంపతులకు వీరబ్రహ్మేంద్ర స్వామి శివానుగ్రహం వల్ల జన్మించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి వివిధ శాసనాలతో పాటు, శిల్పం, వడ్రంగం వంటి కళలలో కూడా ప్రావీణ్యులయ్యారు. 12 ఏళ్ళ వయసుకే తల్లి అనుమతి తీసుకొని దక్షణ పుణ్య క్షేత్రాలన్నింటినీ దర్శించి, అనంతరం కంచీపురం వద్ద కఠోర తపస్సు చేశారు. ఆ తరువాత శ్రీశైలం, యాగంటి క్షేత్రాలను సందర్శించి కర్నూలు జిల్లా బనగానపల్లెకు చేరడం జరిగినది. అక్కడ రైతు కుటుంబానికి చెందిన గరిమిరెడ్డి వెంకటరెడ్డి, అచ్చమ్మ దంపతుల ఇంటిలో బ్రహ్మంగారు పశువుల కాపరిగా చేరారు. ప్రతి దినము ఆవులను తోలుకుంటూ పోయి ఒక గీత గీసి ఆవులను ఆ గీత లోపలే ఆవులను ఉంచేవారు. ఆవులను వదిలి తాను మాత్రం సమీపంలోని రవ్వలకొండ గుహలో కాలజ్ఞానం రచించేవారు. అచ్చెమ్మ దంపతులకు మీ కాపరి ఆవులను ఒక గీత గీసి అందులో ఉంచుతున్నాడని ఆమెకు తెలపగా ఆమె వచ్చి ఆయన మహిమలను చూసి మంత్ర ముగ్ధురాలై బ్రహ్మంగారికి నమస్కరించెను. అప్పటికే బ్రహ్మంగారి మహిమల గురించి విన్న బనగానపల్లె నవాబు బ్రహ్మంగారిని తమ ఆస్థానానికి ఆహ్వానించారు. నవాబు ఒక బంగారు పళ్లెంలో మాంసాహారాన్ని నింపి దానిపై వస్త్రము కప్పి అందరి యెదుట స్వీకరించాలని కోరారు. బ్రహ్మంగారు అందరూ చూస్తుండగానే ఆ పల్లెంపై మంత్ర జలాలు చల్లగా మాంసం కండరాలన్ని పండ్లు, ఫలహారాలుగా మారాయి. దీంతో నవాబు ఆయన మహిమను చూసి విస్తుపోయారు. అనంతరం నవాబుతో పాటు ఉన్న అక్కడ సిబ్బందికి కాలజ్ఞానాన్ని భోదించి బ్రహ్మంగారు సంచారం కొనసాగిస్తూ కడప జిల్లా కందిమల్లాయపల్లె, బ్రహ్మంగారి మఠానికి చేరుకొని అక్కడ వడ్డెర పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. అక్కడున్న వారికి కాలజ్ఞానం భోదిస్తూ తన వంతు పని చేసుకుంటూ ఉండేవారు. స్థానికంగా ఉన్న అగ్రవర్ణాలకు చెందిన వారు బ్రహ్మంగారిని అవమానించేందుకు ప్రయత్నం చేసేవారు. బ్రహ్మంగారికి త్రాగడానికి గుక్కెడు నీరు కూడా ఇవ్వకూడదని గ్రామస్థులకు హుకుం జారీ చేశారు. అపుడు బ్రహ్మంగారు తన నివాసంలోనే జింక కొమ్ముతో రాత్రికి రాత్రే బావిని త్రవ్వారు. ఆ గ్రామ పెద్దకు చుట్ట వెలిగించేందుకు నిప్పు కావాలని కోరడంతో బ్రహ్మంగారు పాలేరు ఈ గ్రామ పెద్దకు నిప్పు కావాలంట, తీసుకురా అని పిలుపునిచ్చారు. ప్రత్యక్షమైన పోలేరమ్మ ఆ గ్రామ పెద్ద చుట్టకు నిప్పు ఇచ్చి అంతలోనే ప్రత్యక్షమాయెను. దీంతో అక్కడున్న ప్రజలంతా ఆశ్చర్యచకితులై స్వామివారి మహిమలు తెలుసుకొని ఆయన కాళ్ళమీద పడసాగారు. ఒక దినమున బ్రహ్మంగారు సిద్దయ్యతో మానవుని మూల స్థానంలో మాలాదార చక్రంపై వినాయకుడున్నాడు, దానిపై స్వాధిష్టాన చక్రంపై బ్రహ్మ ఆ పైన గల మణిపూరక చక్రంపై విష్ణువు, ఆ పైన గల అనాహిత చక్రంపై రుద్రుడు, అటు పిమ్మట విశుద్ధ చక్రంపై జీవుడు కలరు. వీటికి పైన గల ఆజ్ఞేయ చక్రంపై ఈశ్వరుడు కలరు. ఈపై ఆరు చక్రముల మీద ఓం అనే ప్రణవ స్వరూపము కోటి సూర్య తేజస్సుతో ప్రకాశిస్తూ ఉంటుందని సిద్దయ్యకు చెప్పారు. బ్రహ్మంగారు సిద్దయ్యకు చెప్పడం ఆ గ్రామంలో మాదిగ కక్కయ్య చాటుగా విన్నారు. బ్రహ్మంగారిపై అతనికి ధృఢ విస్వాసం, కక్కయ్యకు బ్రహ్మంగారు చెప్పినట్లు దేవతలను చూడాలని బలనీయమైన కోరిక కలిగినది. సరాసరి ఇంటికి వెళ్లి నిద్రిస్తున్న తన భార్యను కత్తితో కోశాడు. కత్తి పోటుకు ఆమె మరణించినది. దేవతలు కన్పించక పోక భార్య మరణించిందని దు:ఖించ సాగాడు. పరుగు పరుగున బ్రహ్మంగారి దగ్గరికి వెళ్లి జరిగిన విషయమంతా తెలిపాడు. అప్పుడు బ్రహ్మంగారు ఓరి మూర్ఖుడా ఎంత పని చేశావని కక్కయ్య ఇంటికి వెళ్లి ఆయన మహిమతో ఆమెను బ్రతికించాడు. అప్పుడు ఆ దంపతులు బ్రహ్మంగారి కాళ్ళ మీద పడి నమస్కరించారు. అలాగే కడప జిల్లాలోని జమ్మలమడుగు తాలూకాలో పెద్దకొమెర్ల గ్రామంలో గోవిందమాంబను వివాహమాడి జీవనం కొనసాగించేవారు. బ్రహ్మంగారికి ప్రియ శిష్యుడుగా దూదేకుల సిద్దయ్య ఉండేవారు. బ్రహ్మంగారికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె కలరు. బ్రహ్మంగారు శిష్యుడైన సిద్దయ్యకు బనగానపల్లెకు వెళ్లి పూలు తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు. అపుడు సిద్దయ్య బనగానపల్లెకు బయల్దేరి బ్రహ్మంగారిని మనసులో తలచుకొని ముళ్ల లేని ఆకులను కోసి జోలిలో వేయగా సుగంధ పరిమళాలు విరజిమ్ము సువాసనతో ప్రత్యక్షమవ్వగా ఆనందోత్సాహంతో కందిమల్లాయపల్లెకు బయల్దేరి వెళ్లారు. ఆ రోజు వైశాఖ శుద్ధ దశమి ఆదివారం అబిజిత్ లగ్నం బ్రహ్మంగారి సమాధి చుట్టూ బంధువులు, భక్తులు ఉన్నారు. వేద మంత్రాలు, మంగల వాయిద్యాలు వినిపించుచుండగా కర్పూర నీరాజనాలు వెలుగుతుండగా బ్రహ్మంగారు పట్టు బట్టలు, కమండలం ధరించి, మకర కుండాళాలతో బంగారు యజ్ఞోప వీతముతో సింహ తలాట మురుగు దప్పముడి ఉంగరము ధరించి భక్తుల మధ్య సూర్యుని వలే తేజోవంతముగా ఉన్నారు. ప్రియ భక్తులారా నేను తపస్సమాధిలోకి వెళుతున్నాను, నాకు మరణం లేదు, నా ధర్మ ప్రతిష్ఠాపనకై వీరభోగ వసంతురాయులునై వస్తాను, నేను వచ్చే సమయం అతి రహస్యంగా ఉంటుంది, ఈ లోపల అనేక విలయాలు, విపత్తులు జరుగుతాయి, నను నమ్మిన భక్తులను రక్షిస్తానని చెప్పి సమాధిలోకి ప్రవేశించారు. బ్రహ్మంగారి సమాధి నిష్ట వహించాక విప్రులకి సంభావనలు ఇచ్చి భక్తులకు అన్నదానం చేసిరి. సంభావనలు పొందిన విప్రోత్తములు తిరిగి వెళుచుండగా దారిలో సిద్దయ్యను చూసి విప్రోత్తమా! తమరు ఎక్కడి నుండి వస్తున్నారని అడిగెను. విప్రోత్తముడు సిద్దయ్యతో నేను కందిమల్లాయపల్లె శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి సజీవ సమాధి మహోత్సవమును చూసి వస్తున్నానని చెప్పెను. విప్రుడు బ్రహ్మంగారి సమాధి మహోత్సవమని చెప్పగానే ఆశ్చర్యము చెంది నోట మాట రాక బ్రాహ్మణోత్తమా మా గురువు గారు నిజముగా సమాధి అయ్యారా అని మరళా ప్రశ్నించెను. సిద్దయ్య శోకం ఆగక అమితంగా దు:ఖించి పరుగెడుతూ సమాధి వద్దకు చేరెను. అక్కడ నిరాశముగా ఉంది. గొంతెత్తి బిగ్గరగా పిలవగా గోవిందమ్మ తలుపు తీసి నాయన గారు సమాధి చెందిరని చెప్పెను. సమాధిని దర్శించుటకు అనుమతి ఇచ్చింది గోవిందమ్మ. సిద్దయ్య తెచ్చిన పూలు సమాధిపై వుంచి నమస్కరించాడు. పిలిచి ప్రార్థించాడు. దు:ఖం ఆగక దు:ఖించ సాగాడు. అయినా బ్రహ్మంగారు పలుకలేదు. నిరాశ చెందిన సిద్దయ్య ప్రాణ త్యాగం చేయ సంకల్పించి గండ కత్తెర తీసుకున్నాడు. బ్రహ్మంగారు ప్రత్యక్షమై సిద్దునితో సిద్దా నీవు ఇంటికి వెళ్లి వివాహం చేసుకొని రాజయోగివై కొంత కాలము నుండి చివరకు కైవల్యము పొందగలవు, నీవు పూజించుటకు నా పాదుకలు, కమండలము, యోగదండము, శిఖా ముద్రికలు ఇస్తున్నానని ఇచ్చారు. సిద్దయ్య భక్తి శ్రద్ధలతో వాటిని తీసుకొని మహా ప్రసాదముగా భావించి గురువు గారి పత్ని, పుత్రులతో అనుమతి తీసుకొని ఇంటికి వెళ్లాడు. ముడుమాలలో ఆదంబీ, పీరుసాహెబ్ తన పుత్రుడైన సిద్దయ్యను చూసి సిద్దయ్య గురువు గారి ఆజ్ఞ ప్రకారం వివాహం చేసుకొని ధర్మ యుతంగా జీవ యాత్ర గడిపారు. బ్రహ్మంగారికి సిద్దయ్య ముందు నీ ఆరాధన జరిగిన తరువాతే నా ఆరాధన వైశాఖ శుద్ధ దశమి నాడు జరుగునని సిద్దయ్యతో బ్రహ్మంగారు చెప్పెను.













### బ్రహ్మంగారి కుమార్తె వీరనారాయణమ్మ సంతతే ప్రస్తుత మఠాధిపతులు

ప్రస్తుత మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరభోగ వసంత వేంకటేశ్వర స్వాముల వారు బ్రహ్మంగారి కుమార్తె వీరనారాయణమ్మ సంతతికి చెందినవారు. ఆ మఠం అభివృద్ధి కోసం మఠాధిపతులు తమ వంతు కృషిగా భక్తుల సహకారంతో దేవస్థానం ముఖ ద్వారాన్ని వింజమూరు గ్రామస్థుడైన సంక్రాంతి రమణయ్య అనే భక్తుడు నిర్మింప చేశారు. భక్తుల సౌకార్యర్థం నిత్యాన్నదానం కొరకు ప్రత్యేక వసతిని ఏర్పాటు చేయించారు. ప్రతి యేడాది బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలకు వచ్చే భక్తులకు ప్రత్యేక వసతులు కల్పించడం, దేవస్థానం అభివృద్ధికి భక్తుల సహకారం, భక్తులు సమర్పించే కానుకలతో అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నారు. ప్రస్తుత మఠం మేనేజర్ ఈశ్వరయ్యాచారి ఆలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నారు. ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మేనేజర్ ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నారు.

బ్రహ్మంగారి మఠానికి విచ్చేసిన యాత్రికులు చూడదగిన పుణ్య ప్రదేశాలు : బ్రహ్మంగారిని దర్శించుకునే వివిధ రాష్ట్రాల నుంచే వచ్చే భక్తులు మరియు యాత్రికులు బ్రహ్మంగారి దేవస్థానంతో పాటు, స్వామి నివాస గృహం, బ్రహ్మంగారి మనుమరాలైన జగన్మాత ఈశ్వరీదేవి ఆలయం, బ్రహ్మంగారి రచ్చబండ, ఈశ్వరమ్మ అమ్మవారు తపస్సు చేసిన గృహం, కక్కయ్య గారి సమాధి, పోలేరమ్మ వారి వేపచెట్టు, తోట్లపల్లె అచలానంద ఆశ్రమం, ముడమాల సిద్దయ్యగారి మఠం, అలాగే అల్లాడుపల్లె వీరబద్ర స్వామి దేవాలయం, బనగానపల్లెలో బ్రహ్మంగారు తపస్సు చేసిన నేలమఠం, రవ్వలకొండ, యాగంటి గృహాలు, గోవులు కాచిన ప్రదేశం, అచ్చమాంబ గారి నివాసం, చింతచెట్టు కింద కాలజ్ఞాన పాత్ర తదితర ప్రదేశాలు చూడదగినవి. యాత్రికులు, భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల నుండి ఆర్టీసి వారి ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు కలవు.



